FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్ ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :204 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 17 - మార్చి - 2026

## పొట్టి శ్రీరాములు గురించి గాంధీ వ్యాఖ్యలను గుర్తు చేసిన పవన్ కల్యాణ్



విగ్రహాన్ని సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. రాజధాని ప్రాంతంలో ఇంతటి మహోన్నతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అమరావతి : అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహావిష్కరణ వేడుక తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచింది. ఈ విగ్రహాన్ని సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... "శ్రీరాములు లాంటి వారు 11 మంది ఉంటే చాలు, ఒక ఏడాదిలోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను" మిగతా..2లో

## హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం.. సోఫాల తయారీ దుకాణంలో ఒక్కసారిగా మంటలు..



హైదరాబాద్ ఫలక్‌నుమా ఫరూఖ్‌నగర్‌లో బస్‌డిపో సమీపంలోని సోఫాల తయారీ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. అక్కడి నుంచి మంటలు పక్కనే ఉన్న ఫర్నిచర్ షాపు, ఇతర దుకాణాలకు వ్యాపించాయి.

హైదరాబాద్, మార్చి 16 : హైదరాబాద్ నగరంలోని ఫలక్‌నుమా ప్రాంతంలో ఈరోజు(సోమవారం) అగ్నిప్రమాదం జరిగింది. ఫలక్‌నుమా ఫరూఖ్‌నగర్‌లోని బస్‌డిపో సమీపంలో ఉన్న సోఫాల తయారీ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం నెలకొంది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మిగతా..2లో

## నందిని సిధారెడ్డి.. తెలంగాణ గర్వించదగ్గ కవి



- ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు.
- నందిని సిధారెడ్డిని అభినందిస్తూ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు
# సీఎం రేవంత్ రెడ్డి క్లాస్

- అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు.
- అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు.
- ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు.
- రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు.



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నారు. పలువురి తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు. బయట చిట్‌చాట్‌లు మానివేయాలని అన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని సమస్యలను చెప్పుకోవడానికి మంత్రులు వారికి సమయం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలు చెప్పే సమస్యలకు స్పందించాలని అన్నారు. ఇక నుంచి తాను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తానని ముఖ్యమంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షాల ప్రతి అంశానికి కౌంటర్ ఇవ్వాలని సూచించారు. ఇప్పటి సీఎల్పీ సమావేశానికి ఆరుగురు సభ్యులు రాలేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయించవచ్చని పేర్కొన్నారు.
మిగతా..2లో

## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో
# కాంగ్రెస్‌ను నిలదీస్తాం



- కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా, అసెంబ్లీకి వెళ్లేముందు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన మిగతా..2లో

## ఏమిటీ అర్ధరాత్రి బదిలీలు... కేంద్ర ఎన్నికల సంఘంపై మమత ఆగ్రహం



- అర్ధరాత్రి వేళ ఈ బదిలీలు చేపట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- "ఇదేమైనా ఢిల్లీ లడ్డూ అనుకుంటున్నారా ఇది వాళ్ల జాగీరా" అని ప్రశ్నించారు.
- "మీరు అన్నీ మార్చండి.. అయినా సరే బెంగాల్‌లో ప్రభుత్వం మారదు. ఇది నా మాట" అని స్పష్టం చేశారు.

ఢిల్లీ :పశ్చిమ బెంగాల్‌లో కీలక ఉన్నతాధికారులను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బదిలీ చేయడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి వేళ ఈ బదిలీలు చేపట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దేశంలో ముడి చమురు కొరత లేదు
# పెట్రోల్ బంకులు యథావిధిగా పనిచేస్తున్నాయి

- దేశంలో ముడి చమురు కొరతపై కీలక ప్రకటన చేసిన కేంద్ర సర్కార్
- భారత్‌లో తగినంత పరిమాణంలో ముడి చమురు అందుబాటులో ఉందని వెల్లడి



ఢిల్లీ: దేశంలో ముడి చమురు కొరత లేదని కేంద్రం స్పష్టం చేసింది. భారతదేశం అంతటా ఇంధన సరఫరా స్థిరంగా ఉందని పేర్కొంది. ముడి చమురు తగినంత పరిమాణంలో అందుబాటులో ఉందని, అన్ని శుద్ధి కర్మాగారాలు వాటి అత్యధిక సామర్థ్యంతో పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ వెల్లడించారు. "దేశంలో తగినంత పరిమాణంలో ముడి చమురు అందుబాటులో ఉంది. అన్ని శుద్ధి కర్మాగారాలు అత్యధిక సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. దేశంలో పెట్రోల్ పంపులు సాధారణంగా పనిచేస్తున్నాయి. ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నట్లు నివేదికలు రాలేదు." అని సుజాత శర్మ తెలిపారు. దేశంలో ఇంధన లభ్యతకు సంబంధించి కొన్ని ప్రాంతాలలో ఆందోళనల నేపథ్యంలో ఈ మేరకు ఆమె వివరణ ఇచ్చారు.

**'సరఫరా గొలుసు సజావుగా పనిచేస్తోంది'**

పెట్రోలియం సరఫరా గొలుసు సజావుగా పనిచేస్తోందని పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ పంపిణీలో ఎటువంటి అంతరాయం లేదని పేర్కొన్నారు. రిటైల్ అవుట్‌లెట్‌లో మిగతా..2లో

## కొత్త సుంకాల విధానం ఖరారైన తర్వాతే అమెరికా
# భారత్ వాణిజ్య ఒప్పందం' ప్రస్తుతం భారత్

అమెరికా మధ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నామని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడి



ఢిల్లీ : అమెరికా- భారత్ మధ్య కొత్త సుంకాల విధానం ఖరారైన తర్వాతే ఇరు దేశాల ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరుగుతాయని ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. ప్రస్తుతం భారత్ - అమెరికా మధ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నామని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వివరించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఇతర దేశాలతో ఒప్పందాలను కుదుర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం గ్లోబల్ టారిఫ్ ఆర్కిటెక్చర్‌పై అమెరికా పని చేస్తోందని రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ట్రేడ్ డీల్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఇరుదేశాల మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

'అనిశ్చితుల నేపథ్యంలో భారత ఎగుమతి పనితీరు స్థిరంగా ఉంది'

"మేము ప్రస్తుతం అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చిస్తున్నాం. కొత్త సుంకాల విధానం అమల్లోకి వచ్చిన తర్వాతే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరుగుతాయి" అని ఆయన చెప్పారు. తాజా వాణిజ్య డేటాను ప్రభుత్వం ప్రచురించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. నెలవారీ తగ్గుదల ఉన్నప్పటికీ, ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో భారత ఎగుమతి పనితీరు స్థిరంగా ఉందని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం నేపథ్యంలో సరకు అంతరాయాల కారణంతో మార్చిలో షిప్‌మెంట్‌లు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.
మిగతా..2లో

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా: 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్



అమరావతి : అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజారాజధాని అమరావతిలో తన హామీకి ప్రతిరూపంగా నిలిచిన 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణ తనకెంతో ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని అమరావతిలోని శాఖమూరులో ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,

## ఏపీలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' - పొట్టి శ్రీరాములు త్యాగాన్ని
# తెలుగు జాతి గుర్తు పెట్టుకోవాలి

- అమరావతిలో పొట్టి శ్రీరాములు భారీ విగ్రహం ఆవిష్కరణ
- విగ్రహాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, మాధవ్
- పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా 58 అడుగుల భారీ కాంస్య విగ్రహం



అమరావతి : రాజధాని అమరావతి పరిధిలోని శాఖమూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, మంత్రులు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6.8 ఎకరాల్లో నిర్మిస్తున్న స్మృతివనంలో అమరజీవి 125వ జయంతి వేడుకలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఆర్యవైశ్య సంఘాలు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం మంత్రులతో కలిసి సీఎం చంద్రబాబు పొట్టి శ్రీరాములు స్మృతివనం నిర్మాణ పనుల్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, స్ఫూర్తికి మారు పేరు పొట్టి శ్రీరాములు అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 58 రోజుల నిరాహారదీక్షకు చిహ్నంగా 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారని తెలిపారు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, స్టాట్యూ ఆఫ్ యూనిటీ తరహాలో ఏపీలో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ ఉందని వ్యాఖ్యానించారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగువారికి గుర్తింపు కూడా లేని రోజుల్లో తెలుగు వారి సత్తా చాటిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రాణాలను లెక్క చేయకుండా తెలుగు వారి రాష్ట్రం కోసం పోరాడారన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాలకు కేంద్రం నాంది పలికిందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఐదు దశాబ్దాల్లో అనునిత్యం అనేక విషయాల్లో పొట్టి శ్రీరాములు గాంధీజీ స్ఫూర్తితో పోరాడారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. భార్య, పిల్లలు చనిపోయిన తర్వాత బాధను మిగతా..2లో

## పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైసీపీ విమర్శలు దుర్మార్గం



- 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఇది ఎన్నికల హామీని నిలబెట్టుకోవడమేనని స్పష్టం చేశారు.
- వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు దుర్మార్గమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు.

## మొదటి పేజ తరువాయి

## పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైసీపీ విమర్శలు దుర్మార్గం

అమరావతి : అమరావతిలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు దుర్మార్గమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. భవిష్యత్ తరాలకు పొట్టిశ్రీరాములు త్యాగనిరతి స్ఫూర్తిగా నిలవాలనే లక్ష్యంతో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఇది ఎన్నికల హామీని నిలబెట్టుకోవడమేనని స్పష్టం చేశారు. దోపిడీ, లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలకు త్యాగాల విలువ తెలియడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆర్యవైశ్యులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. ఎవరికీ సాయం చేయకూడదనే డీఎన్ఏ జగన్‌ది కాబట్టే, కన్నతల్లిని, చెల్లిని కూడా మోసం చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అడ్డగోలుగా అప్పు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని మంత్రి విమర్శించారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని తాము అధికారంలోకి వచ్చాక ఐసీయూలోకి తీసుకొచ్చామని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో సౌకర్యవంతమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని నిమ్మల రామానాయుడు వివరించారు.

## పొట్టి శ్రీరాములు గురించి గాంధీ వ్యాఖ్యలను గుర్తు చేసిన పవన్ కల్యాణ్

అని గాంధీజీ అన్నారంటే, ఆయన సంకల్ప బలం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చని కొనియాడారు. రాజధాని ప్రాంతంలో ఇంతటి మహోన్నతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి క్లాస్

అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు. తాము ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. సభలో మాట్లాడే సమయంలో విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వని సందర్భాలు ఉన్నాయని, కానీ తాము ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు పార్టీ, ప్రభుత్వం లైన్‌లోనే స్పందించాలని సూచించారు.

## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం

ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళు లర్పించడం తమ పార్టీకి సంప్రదాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతులను పట్టించుకోకుండా రాహుల్ గాంధీ కోసం రూ.1000 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో తాము పోరాడతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో పంట వేయకముందే రైతు బంధు నిధులు అందేవని, ఇప్పుడు పంట కోతలు పూర్తవుతున్నా ప్రభుత్వ సాయం అందడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, తొలి కేబినెట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా గ్యారెంటీలకు చట్టపరమైన భద్రత కల్పించలేదని విమర్శించారు. గతంలో గవర్నర్ ప్రసంగంలోనూ ఈ హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. బలహీన వర్గాలకు ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్లు కేటాయిస్తామన్న హామీపైనా స్పష్టత లేదని అన్నారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావించి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం.. సోఫాల తయారీ దుకాణంలో ఒక్కసారిగా మంటలు..

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఒక్కసారిగా మంటలు...

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోఫాల తయారీ షాపులో మొదలైన మంటలు వేగంగా వ్యాపించాయి. అక్కడ ఎక్కువగా ఫోమ్, చెక్క సామగ్రి, ఫర్నిచర్ వస్తువులు ఉండటంతో మంటలు వేగంగా విస్తరించాయి. సోఫాల తయారీ దుకాణంలో ప్రారంభమైన మంటలు పక్కనే ఉన్న ఫర్నిచర్ షాపు, ఇతర చిన్న దుకాణాలకు కూడా వ్యాపించాయి. దీంతో అక్కడి వ్యాపారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. కొన్ని దుకాణాల నుంచి వస్తువులను బయటకు తీసి నష్టాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

### మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు..

సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు స్థానికులు కూడా మంటలను ఆర్పేందుకు సహకరించారు. మంటలను నియంత్రించేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. ఫోమ్, చెక్క వంటి పదార్థాలు ఎక్కువగా ఉండటం వల్ల మంటలు పూర్తిగా అదుపులోకి రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

### భారీ నష్టం సంభవించే అవకాశం..

ఈ అగ్నిప్రమాదంలో దుకాణాల్లో ఉన్న ఫర్నిచర్ వస్తువులు, సోఫాలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా అనే విషయంపై పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. మంటలను పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే ఈఘటనకు జరగడానికి అసలు కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఏమిటీ అర్ధరాత్రి బదిలీలు... కేంద్ర ఎన్నికల సంఘంపై మమత ఆగ్రహం



బీజేపీ కనుసన్నల్లోనే ఈసీ పనిచేస్తోందని, ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని ఆరోపించారు. సోమవారం అర్ధరాత్రి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, హోం సెక్రటరీ జేపీ మీనాలతో పాటు డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ఈసీ బదిలీ చేసింది. దీనిపై మమత ఘాటుగా స్పందించారు. "అర్ధరాత్రి ఒంటి గంటకు నాకు మెసేజ్ వచ్చింది. ఇలాంటి చర్యలు ఎప్పుడైనా చూశారా చీఫ్ సెక్రటరీ ఒక బెంగాలీ మహిళ. ఆమెను తొలగించారు. వీళ్లు బెంగాలీలకు, మహిళలకు వ్యతిరేకులు" అంటూ కేంద్రంపై మండిపడ్డారు. గతంలో అధికారుల బదిలీకి ముందు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముగ్గురి పేర్లతో జాబితాను ఈసీ కోరేదని, కానీ ఈసారి ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని మమత ఆరోపించారు. "ఇదేమైనా ఢిల్లీ లడ్డూ అనుకుంటున్నారా ఇది వాళ్ల జాగీరా" అని ప్రశ్నించారు. డీజీపీగా ఉన్న పీయూష్ పాండే బెంగాలీ కాదని, ఆయనను కూడా తొలగించారని గుర్తు చేశారు. బీజేపీకి అనుకూలంగా పనిచేసే వారిని మాత్రమే ఎంపిక చేసుకుంటున్నారని విమర్శించారు. వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కోల్‌కతాలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు అన్నీ మార్చండి.. అయినా సరే బెంగాల్‌లో ప్రభుత్వం మారదు. ఇది నా మాట" అని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి శశి పంజా ఇంటిపై దాడి జరిగినట్లే, తన నివాసంపై కూడా దాడి చేసే అవకాశం ఉందని మమత ఆందోళన వ్యక్తం చేశారు. "ధైర్యం ఉంటే వచ్చి దాడి చేయండి. మేం ఎదుర్కొంటాం" అని సవాల్ విసిరారు. అదే సమయంలో, ప్రజలు సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే చర్యలకు లొంగవద్దని సూచించారు.

## ఏపీలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' - పొట్టి శ్రీరాములు త్యాగాన్ని తెలుగు జాతి గుర్తు పెట్టుకోవాలి

### మొదటి పేజ తరువాయి

దింగమింగి దేశం కోసం పోరాడారని ఉద్ఘాటించారు. దళితులకు ఆలయ ప్రవేశం కోసం 29 రోజుల నిరాహార దీక్ష చేశారని సీఎం తెలిపారు. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగు జాతి గుర్తు పెట్టుకోవాలన్నారు. రాజధాని రైతుల పోరాటం ఓ చరిత్ర : తెలుగు జాతి గతంలోనూ ఇప్పుడూ అనేక సమస్యలు ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్ర రాజధాని కర్నూలు, ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ గా ఏర్పాటు చేసుకుని తెలుగు జాతి మనుగడ సాగించిందన్నారు. ఆ తర్వాత అమరావతి రాజధానిగా నవ్యాంధ్ర రాష్ట్రం ఏర్పడిందని చంద్రబాబు స్పష్టం చేశారు. 2019-24 మధ్య కాలంలో రాజధాని మూడు ముక్కలాటగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానులన్నవారు, అసలు రాజధానే లేని పరిస్థితి తెచ్చారని దుయ్యబట్టారు. ఇప్పుడు ప్రజా రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందుతోందన్నారు. తెలుగు జాతి వివిధ సమయాల్లో విడిపోయి ఉంది, వివిధ సందర్భాల్లో కలిసి ఉందన్నారు. తెలుగు జాతికి రెండు రాష్ట్రాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాజధానితో గత పాలకులు ఆటలాడటం బాధేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ముందుగా ఎవ్వరూ గుర్తించని విధంగానే, ఇక్కడి రైతుల త్యాగాన్ని కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతుల త్యాగం ఓ స్ఫూర్తి, చరిత్ర అని గుర్తు చేసుకున్నారు. 2019-24 మధ్య కాలంలో రాజధాని రైతుల పోరాటం ఓ చరిత్రని కొనియాడారు. అమరజీవి జలధార పేరుతో జజీవన్ మిషన్ : భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు



పొట్టిశ్రీరాములు అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలుగు జాతి ఉనికి కోసం ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆంధ్రరాష్ట్రం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవటానికి కారకులైన మహనీయుడిని స్మరించుకోవటం అందరి బాధ్యత అని అన్నారు. త్యాగానికి ప్రతిరూపంగా 58 అడుగుల విగ్రహం రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయటం గొప్ప విశేషమన్నారు. అమరజీవి జలధార పేరుతో జలజీవన్ మిషన్ ను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని పవన్‌కల్యాణ్ వెల్లడించారు. నీరు తాగే ప్రతి ఒక్కరూ పొట్టిశ్రీరాములు పేరును స్మరించుకోవాలనే ఈ పేరు పెట్టామన్నారు. దాదాపు రూ.10వేల కోట్లతో 7వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరజీవి జలధార పేరుతోనే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పొట్టి శ్రీరాములు వారసులతో కూర్చుని కార్యక్రమంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాజధాని నడిబొడ్డున 58 అడుగుల విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన చంద్రబాబు, లోకేశ్ లకు పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. పొట్టి శ్రీరాములు పేరుతో ప్రత్యేక కాయిన్ : మరణం లేని గొప్ప శక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం ఈ స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్ అని అన్నారు. తాను తెలుగువాడిని అని గర్వంగా చెప్పుకునే గౌరవం అందించిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అనతికాలంలోనే పొట్టిశ్రీరాములు విగ్రహం అమరావతిలో ఏర్పాటు చేశామని తెలిపారు. పొట్టి శ్రీరాములు చరిత్ర భావితరాలు గుర్తు పెట్టుకునేందుకే ఈ భారీ విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని మంత్రి వివరించారు. నిస్వార్థ పోరాటం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని అన్నారు. వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం అన్నట్లుగా నిరాహార దీక్ష చేపట్టి ఆంధ్ర రాష్ట్రం సాధించారని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కోసం తొలి అడుగు వేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. ప్రపంచ చిత్ర పటాన్ని రూపొందించిన మర్కటర్ తరహాలో ఆంధ్ర రాష్ట్ర రూపానికి పొట్టిశ్రీరాములు కారకులయ్యారని తెలిపారు. పొట్టి శ్రీరాములు పేరుతో ప్రత్యేక కాయిన్ విడుదల చేసేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి లోకేష్ తెలిపారు. అనంతరం తపాలా శాఖ రూపొందించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పోస్టల్ కవర్ లను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ లు ఆవిష్కరించారు. అమరావతి అభివృద్ధి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో చేపట్టబోయే కార్యక్రమాలపై ఏవీ ప్రదర్శించారు.

### కొత్త సుంకాల విధానం ఖరారైన తర్వాతే అమెరికా

## భారత్ వాణిజ్య ఒప్పందం' ప్రస్తుతం భారత్

### మొదటి పేజ తరువాయి

ఫిబ్రవరిలో దిగుమతులు 24.11 శాతం పెరిగి 63.71 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే కాలంలో 51.33 బిలియన్ డాలర్ల దిగుమతులు నమోదయ్యాయి. ఫలితంగా ఫిబ్రవరిలో వాణిజ్య లోటు 27.1 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2025 ఫిబ్రవరి 13న నుంచి భారత్ , అమెరికా మధ్య పలు దశల్లో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు జరిగాయి. భారత్, అమెరికా పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇరు దేశాలు గత నెలలో తొలిదశ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఫ్రేమ్‌వర్క్‌నకు ఇరు దేశాలు ఆమోదం తెలిపాయి. దాని ప్రకారం భారత్‌పై విధించిన సుంకాలను 18 శాతానికి తగ్గించేందుకు అమెరికా అంగీకరించింది. ఇందులో భాగంగా ఈ నెలలో వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయాల్సి ఉంది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను ఆ దేశ సుప్రీం కోర్టు కొట్టివేసింది. దీంతో ఆర్టికల్ 122 ప్రకారం అన్ని దేశాలపై అమెరికా 10 శాతం టారిఫ్‌లను విధించింది. గత నెల 24 నుంచి 150 రోజుల పాటు ఇవి అమల్లో ఉంటాయి. దీంతో టారిఫ్ అంశంపై సందిగ్ధత నెలకొంది.

### ఏప్రిల్ లో సంతకాలు జరిగే అవకాశం

మరోవైపు భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహం వల్లే ఈ డీల్ కుదిరిందని చెప్పారు. వచ్చే నెలలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఇరుదేశాల మధ్య త్వరలోనే క్రిటికల్ మినరల్స్ అగ్రిమెంట్ కూడా కుదరనుందని అన్నారు.

### వాణిజ్య ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడం లేదని కేంద్రం స్పష్టం



అంతకుముందు అమెరికాతో గత నెలలో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని భారత్ నిలిపివేయనుందని ప్రచారం సాగింది. అయితే, అమెరికా ట్రేడ్ డీల్ రద్దు చేసుకోనున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పరస్పర ప్రయోజనాన్ని అందించే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్-అమెరికా చర్చలు కొనసాగుతున్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గత నెలలో వాషింగ్టన్‌లో ఇరు దేశాలకు చెందిన ముఖ్య సంధానకర్తలు సమావేశం కావాల్సి ఉన్నా, టారిఫ్ రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో వాయిదా పడింది.

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా: 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

### మొదటి పేజ తరువాయి

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి త్యాగశిల్పం వద్ద ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని దూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది" అని వివరించారు.

### యువగళం హామీని నిలబెట్టుకున్నా

తాను తెలుగువాడినని, ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నానని, ఆ గౌరవాన్ని మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు అని లోకేశ్ అన్నారు. "యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిసి వారి సమస్యలు చర్చించాను. వారికిచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని ఇంత తక్కువ సమయంలో నిలబెట్టుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ విగ్రహంలోని 58 అడుగులు, ఆయన చేసిన 58 రోజుల దీక్షకు సంకేతం. మనం ఒక్కరోజు ఉపవాసం ఉండటానికే



ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్రం కోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత" అని లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం 194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ట్రస్ట్ సభ్యులను, అధికారులను ఆయన అభినందించారు.

### నిత్య పోరాటయోధుడు పొట్టి శ్రీరాములు

పొట్టి శ్రీరాములు జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన నిత్య పోరాటయోధుడని లోకేశ్ కొనియాడారు. "ఆయన స్వార్థం లేని ఉద్యమాలు చేశారు. గాంధీజీతో కలిసి సబర్మతి ఆశ్రమంలో పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లారు. నెల్లూరులో దళితుల ఆలయ ప్రవేశం కోసం, అంటరానితనంపై పోరాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడకపోవడం మహాపాపం అని ప్రకటించి, 'వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం' అని నిశ్చయించుకున్నారు. దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే రోడ్డు మీదే చేస్తానన్న ఆయన స్ఫూర్తి నా యువగళం పాదయాత్రకు ప్రేరణగా నిలిచింది" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. 1952 అక్టోబర్ 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించినప్పుడు 53.9 కిలోల బరువున్న పొట్టి శ్రీరాములు, 58వ రోజుకు 38.1 కిలోలకు పడిపోయారని, అయినా వెనకడుగు వేయకుండా ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని లోకేశ్ వివరించారు. ఆయన ప్రాణత్యాగం కోట్ల మందిని కదిలించి, ఢిల్లీని దిగివచ్చేలా చేసిందని, ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

భారతదేశ చిత్రపటాన్ని మార్చిన మహనీయుడు

ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాసాన్ని ఉటంకిస్తూ, "పొట్టి శ్రీరాములు గారి దీక్ష తర్వాతే భారతదేశ చిత్రపటంపై భాషా ప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని గుహ అన్నారు. అందుకే ఆయనను 'భారతదేశ మెర్కాటర్'గా అభివర్ణించారు. 16వ శతాబ్దంలో ప్రపంచ పటాన్ని రూపొందించిన భౌగోళిక శాస్త్రవేత్త మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి చరిత్రను దేశం గుర్తుంచుకునేలా ఈ విగ్రహం దోహదపడుతుంది" అని లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి రోశయ్యను స్మరించుకున్న లోకేశ్, ఆయన రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని లోకేష్ వెల్లడించారు. రాబోయే 12 నెలల్లో స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్. సవిత, టీజీ భరత్, పి. నారాయణ, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, అధికారులు, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## నందిని సిధారెడ్డి.. తెలంగాణ గర్వించదగ్గ కవి: కేసీఆర్

హైదరాబాద్, మార్చి 16 : ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డిని అభినందిస్తూ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నందిని సిధారెడ్డి దీర్ఘ కవితా సంపుటి 'అనిమేష', కరోనా సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యంగా చిత్రీకరించడం ద్వారా ఈ అవార్డు పొందడం గొప్ప విషయమని తెలిపారు.

### తెలంగాణకు గర్వకారణం..

ఈ సందర్భంగా నందిని సిధారెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవి నందిని సిధారెడ్డి అని పేర్కొన్నారు. తన సాహిత్యం తెలంగాణ జీవితాన్ని అక్షరబద్ధం చేసిందని, తెలంగాణ ప్రజలకు గర్వకారణంగా నిలిచిందని చెప్పుకొచ్చారు. నందిని సిధారెడ్డి తెలంగాణ గర్వించదగ్గ కవి మాత్రమే కాక, మానవ సంబంధాలు, సామాజిక సమస్యలు, ప్రజల జీవిత అనుభవాలను సృజనాత్మకంగా చిత్రించే ప్రతిభావంతమైన రచయిత అని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

### మంజీరా రచయితల సంఘం..

మెదక్ జిల్లాకు కేంద్రంగా ఏర్పాటైన మంజీరా రచయితల సంఘం ద్వారా నందిని సిధారెడ్డి అన్నివర్గాల ప్రజల సమస్యలు, సామాజిక సమానత్వం కోసం రచనలు చేశారని కేసీఆర్ తెలిపారు. తన కలను, భావాలను కవిత్వ రూపంలో ప్రజల ముందుకు తీసుకొచ్చారని అన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు ఆలోచనాత్మక మార్గదర్శకత్వం ఇచ్చే ప్రయత్నంగా, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే విధంగా ఉందని కేసీఆర్ తెలిపారు.

ఉద్యమ కవిగా తెలంగాణ సాధనలో ప్రతిభ..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో నందిని సిధారెడ్డి పాటలు, కవిత్వం ద్వారా ప్రజలను ఆలోచింపజేసి, ఉద్యమ కవిగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. కవిత్వం, సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యానికి ప్రేరణ కలిగించారని అన్నారు. ప్రజల జీవితాల అనుభవాలను అక్షరబద్ధం చేయడం వంటి అంశాలను కేసీఆర్ ప్రత్యేకంగా హైలైట్ చేశారు.

### కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు..

భారతీయ సాహిత్య ప్రపంచంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అత్యున్నతమైనదని కేసీఆర్ తెలిపారు. ప్రతి సంవత్సరం భారతీయ భాషల్లో ప్రసిద్ధ రచయితలకు, వారి సాహిత్య కృషికి ప్రతిఫలంగా ఈ అవార్డు ఇస్తారని చెప్పుకొచ్చారు. నందిని సిధారెడ్డి 'అనిమేష' ద్వారా సాహిత్య రంగంలో చేసిన విశిష్టమైన కృషికి ఈ అవార్డు పొందడం తెలంగాణ సాహిత్య ప్రపంచానికి గొప్ప ఘనత అని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

## దేశంలో ముడి చమురు కొరత లేదు- పెట్రోల్ బంకులు యథావిధిగా పనిచేస్తున్నాయి

ఇంధనం నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చమురు మార్కెటింగ్ కంపెనీలు సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు.

ముంద్రా పోర్టుకు చేరుకోనున్న నౌకలు

మరోవైపు, శివాలిక్ నౌకలో ఎల్పీజీ క్యారియర్‌ను తీసుకొస్తున్నామని కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అధికారి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఆ నౌకను త్వరలోనే గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవులో డాకింగ్ చేయనున్నట్లు చెప్పారు. "పర్షియన్ గల్ఫ్ నుంచి హర్ముజ్ జలసంధిని దాటి శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ ఈ రోజు (సోమవారం) సాయంత్రానికి ముంద్రా పోర్టుకు చేరుకుంటుంది. ఆ నౌక రాకముందే సరుకును విడుదల చేయడంలో ఎటువంటి ఆలస్యం జరగకుండా డాక్యుమెంటేషన్, ప్రాధాన్యత బెర్తింగ్ వంటి వాటిని ఓడరేవులో ఏర్పాటు చేశాం." అని రాజేశ్ సిన్హా స్పష్టం చేశారు. "పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని అందరూ భారతీయ నావికులు సురక్షితంగా ఉన్నారు. గత 24 గంటల్లో ఎటువంటి దుర్ఘటన జరగలేదు. మేము వారి పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచాం. ప్రతి నౌక, అందులోని సిబ్బందితో సంప్రదింపులు జరుపుతున్నాం. 22 భారతీయ జెండా కలిగిన నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోని హర్మూజ్ జలసంధికి పశ్చిమాన ఉన్నాయి. ఆ నౌకల్లో 611 మంది భారతీయ నావికులు ఉన్నారు. మార్చి 14న యూఏఈ నుంచి బయలుదేరిన భారత జెండా ఉన్న నౌక జాగ్ లాడ్కి దాదాపు 81,000 టన్నుల ముర్బన్ ముడి చమురును మోసుకొస్తోంది. అది భారత్‌వైపునకు సురక్షితంగా ప్రయాణిస్తోంది. ఆ నౌకలో ఉన్న భారతీయ నావికులందరూ సేఫ్‌గా ఉన్నారు. వారు మంగళవారం ముంద్రా పోర్టుకు చేరుకుంటారు." అని రాజేశ్ సిన్హా పేర్కొన్నారు.

దేశానికి తిరిగొచ్చిన 2,20,000 మంది భారతీయులు

యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్‌తో సహా వివిధ గల్ఫ్ దేశాల నుంచి 45 విమానాలు సోమవారం భారత్ లోని వివిధ విమానాశ్రయాలకు చేరుకోనున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సీమ్ మహాజన్ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు సుమారు 2,20,000 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఖతార్ గగనతలం పాక్షికంగా తిరిగి తెరుచుకోవడంతో అక్కడి నుంచి విమానాలు భారత్‌కు నడుస్తున్నాయని వెల్లడించారు. సోమవారం, మంగళవారం నాడు ఖతార్ నుంచి మూడు విమానాలు భారత్‌కు చేరుకుంటాయని స్పష్టం చేశారు. "మార్చి 13న ఒమన్‌లోని సోహార్ నగరంలో జరిగిన ఒక దాడిలో దురదృష్టవశాత్తు ఇద్దరు భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మస్కట్‌లోని ఇండియన్ ఎంబసీ మృతుల కుటుంబాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. ఒమన్ అధికారులతో టచ్‌లో ఉంది. మృతుల భౌతిక కాయాలను త్వరలోనే భారత్‌కు తరలించే అవకాశం ఉంది. ఇరాన్ నుంచి దాదాపు 90 మంది భారతీయులు

# సంపాదకీయం

## మానవ విలువల కథా దర్పణం

ఉత్తరాంధ్రలో తొలి తరం కథకులుగా నలుగురిని చెప్పుకోవచ్చు. గురజాడ, చాసో, రావిశాస్త్రి, కాళీపట్నం. ఐతే వీరందరూ భిన్న కాలాలకు చెందినవారు. గురజాడ 1910లో 'దిద్దుబాటు' కథను ప్రచురిస్తే, కాళీపట్నం 'యజ్ఞం' 55ఏళ్ళ తర్వాత వచ్చింది. 1960 దశాబ్ది తర్వాత ఎంతో మంది ఉత్తరాంధ్ర కథకులు వారివారి సృజనాత్మక నైపుణ్యంతో వైవిధ్య భరితమైన ఇతివృత్తాలతో తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఆ కోవలోని విలక్షణ కథకులు బెహరా వెంకట సుబ్బారావు. "మేం చదువుకొనే రోజుల్లో ఎన్నో శవాల్ని కోసి చూశాం! అవి ఏ కులానికి చెందినవో తెలీదు. అది మా కనవసరం. అందరి శరీరాలు ఒక్కలాగే ఉంటాయి. స్నానం చేయమని మీరెప్పుడూ దండించలేదు. స్నానం రెండు పూటలా చేస్తాను కాబట్టి. కానీ మీరన్నట్టు వారెవరినో తాకినందుకు కాదు. శవాల్ని ముట్టినందుకూ కాదు! శరీర పరిశుభ్రత కోసం! ఆత్మశుద్ధి లేని ఆచారం ఎందుకు చెప్పండి?" అని ఒక పాత్రచేత ఒక కథలో కథకుడు పలికించిన మాటలు ఆయన వ్యక్తిత్వాన్ని మానవీయ గుణాన్ని ప్రతిబింబిస్తాయి. బెహరా కథల్లో ప్రగతిశీల భావాలను, నాటి సమాజం పోకడలపై ఆయన అవగాహనను, ప్రధానంగా మధ్యతరగతి జీవితాలపై నిశిత పరిశీలనను చూడవచ్చు. ఇటీవల వెలువడిన బెహరా వారి కథా సంపుటి 'మధ్యతరగతి మందహాసం'లో 73 కథలు, 'నిశ్శబ్ద సంగీతం' నవల, 'దారి తప్పకు అనే బాలల కథ చోటు చేసుకున్నాయి. 1935 జూన్ 6 తేదీన తూర్పు గోదావరి జిల్లా పిడపర్తి గ్రామంలో బెహరా విజయలక్ష్మి, సత్యనారాయణ దంపతులకు జన్మించిన సుబ్బారావు తపాలా శాఖలో ఉద్యోగం చేసి హెడ్ పోస్టుమాస్టర్‌గా పదవీ విరమణ చేశారు. 1957 నుంచి మొదలుపెట్టి సుబ్బారావు రాసిన రచనలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, జ్యోతి, విజయ, స్వాతి, మయూరి, విజయ, నీలిమ, భారతి, యువ, యోజన మొదలైన పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీరి కథలు ఆకాశవాణిలో కూడా ప్రసారమయ్యాయి. ఏ మనిషికైనా ప్రాణం విలువ ఒకటే. డబ్బులు కోసం ఒక పేదవాడి భార్యకు ఆపరేషన్ చెయ్యలేదు డాక్టర్. అదే డాక్టర్ భార్య ప్రాణాపాయ స్థితిలో ఉంటే రిక్షా లాగి సమయానికి ట్రైన్‌కి అందించాడు ఆ రిక్షా కార్మికుడు. ధనం కన్నా మానవత్వం ఎంత గొప్పదో చెప్పే 'ప్రాణం ఖరీదు' కథ 1986లో భారతిలో వచ్చింది. 'ఇంట గెలుపు' దళిత సమస్యపై రాసిన కథ. అంటరానితనంపై ఒక దళిత యువకుడు కొత్త పద్ధతిలో చేసిన పోరాటం ఒక కోణమైతే, దళితుల్లోనే ఒక జాతి ఇంకో జాతిని తక్కువగా చూసే స్థితి మరో కోణం. ఇవాళ్టి వర్గీకరణ సమస్య మూలాలు ఈ కథలో పరోక్షంగా ప్రస్తావనకు వచ్చాయి. ' విలువలు' శీర్షికన రెండు కథలు వచ్చాయి. మధ్యతరగతి కుటుంబాల్లోని అన్నదమ్ముల అనుబంధాన్ని చిత్రీకరిస్తూ తనకు సాయం చెయ్యని తమ్ముణ్ణి సమయానికి ఆదుకున్న అన్నయ్య కథ ఒకటి అయితే, మరో కథలో "మనిషికి విలువ లేదండి! అతని మాటకే విలువండి" అని టాక్సీ డ్రైవర్ ఓబులేసుతో చెప్పిస్తూ మాటకు కట్టుబడడం ఎవరికైనా జీవితంలో ఒక గొప్ప విలువ అని, ఆ విలువను పాటించడానికి చదువు హోదాలతో పని లేదని మరో 'విలువలు' కథలో కనిపిస్తుంది. 'ఆంతర్యం' కథ మనుషుల స్వభావాల్లోని వైచిత్రిని చూపిస్తుంది. కోడలిపై ప్రేమ, అభిమానం ఉన్నా తన అత్త తనను సాధించేది గనక తానూ కోడల్ని ఏదో అంటూ ఉండాలని అనుకునే అత్తగారి ఆంతర్యం, స్వంత ఊరికి బదిలీ అడిగితే తాను ఇతర రాష్ట్రాల్లోనూ పనిచేశానని తన కష్టాలు చెప్పుకొని కింది ఉద్యోగి అడిగిన బదిలీకి అంగీకరించని అధికారి ఆంతర్యం ఒక్కటే. 'తన దాకా వస్తే' కథ హక్కులు ప్రభుత్వ ఉద్యోగులకే కాదు పని మనుషులకూ ఉంటాయని చెబుతోంది "నేనూ మీలాంటి మడిసినే. ఒంట్లో సుకంగా లేకపోతే అయ్యగారు ఆఫీసు కెళు తున్నారేటి? సెలవు పెడ్తున్నారు అలాగే నేనూను," అంటుంది పని మనిషి. తనను మానిపిస్తే ఇంకొకరిని రాని వ్వనంటుంది. "కట్నాలు బేరమాడే వాళ్లంటే నాకు నచ్చదు. నాన్నగారూ. అలాంటి వారిని చూస్తే అసహ్యం," అని తెగేసి చెప్పి నిజాయితీ పరుడైన ఆనందారావుకి రెండో భార్యగా అతడి పిల్లలకు తల్లిగా ఉంటూ తన మాతృత్వాన్ని త్యాగం చేసిన స్త్రీ పాత్రను 'మాతృమూర్తి' కథలో చిత్రించారు. మరణించిన వాడిది ఏ కులం అని చర్చించిన పెద్దలు, బడుగు వర్గాల్లోనూ ఐక్యత లేకుండా తమలో తాము జాతి భేదాలు పాటించే దుస్థితిని చిత్రిస్తూ కొందరు యువకులు గ్రామంలో తీసుకు వచ్చిన సామాజిక విప్లవాన్ని 'నదీనాం సాగరో గతి' కథలో ఆవిష్కరించారు. తన కొడుక్కి యోగ్యతకు మించి సహాయం చేసి ఉద్యోగ ధర్మానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని ఒక పేద ఉపాధ్యాయుడు అధికారంలో ఉన్న శిష్యుడికి చెప్పడం 'కర్తవ్యం' కథ. దాంపత్య జీవితానికి సంబంధించిన కథలు, సాధారణ మానవుల్ని కలవరపరిచే సమస్యలపై కథలు... ఏ వస్తువు తీసుకున్నా ఒక నైతిక సందేశం, విలువల ప్రబోధం అంతర్లీనంగా మానవతావాదం ప్రవహిస్తూ బెహరా గారి కథలు ఏ కథకా కథ విశిష్టంగా గోచరిస్తుంది. సిద్ధాంత రాద్ధాంతాలతో నిమిత్తం లేకుండా తన చుట్టూ ఉన్న మనుషుల్ని సరైన కోణంలో అవగాహన చేసుకొని తెలుగుదనం ఉట్టిపడేలా సరళమైన శైలిలో ఆద్యంతం

# నాలుగేళ్ల యుద్ధం...ఎప్పుడు ముగుస్తుంది?



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటి పోయింది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా ఖండంలో జరుగుతున్న అత్యంత భీషణ సంగ్రామం ఇదే. దీనివల్ల అపారంగా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తున్నాయి. అంతర్జాతీయ ఆహార, ఇంధన సరఫరా గొలుసులు దెబ్బతినిపోయాయి. 2022-25 మధ్య శాంతి సాధనకు జరిగిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఈ యుద్ధాన్ని ఎలా ఆపాలన్న విషయంలో అమెరికా, నాటో మిత్రుల మధ్య ఇటీవల విభేదాలు తలెత్తాయి. దాంతో అమెరికా చొరవతో త్వరలో జరగనున్న సయోధ్య ప్రయత్నాలపైనా అనిశ్చితి అలుముకుంది. అమెరికా, ఐరోపా దేశాల సైనిక కూటమి నాటో: ఒకప్పుడు సోవియట్ యూనియన్ అంతర్భాగాలుగా ఉండి తరవాత స్వతంత్ర దేశాలైన ఉక్రెయిన్, జార్జియా వంటి వాటిని నాటో కూటమిలోకి చేర్చుకోరాదని రష్యా 2021 డిసెంబరులో షరతు పెట్టింది. అంటే నాటో సేనలు తన సరిహద్దుల వరకు విస్తరించకూడదన్నది దాని అంతరార్థం. అలాగే 1997 మే తరవాత ఆ కూటమిలో చేరిన దేశాల్లో అమెరికా, నాటో సేనలను, ఆయుధాలను మోహరించకూడదన్నది రెండో షరతు. రష్యా పెట్టిన ఈ రెండు షరతులనూ అమెరికా, నాటోలు తిరస్కరించాయి. ఉక్రెయిన్‌ను కూటమిలో చేర్చుకుంటే అమెరికా, నాటో సేనలు తన సరిహద్దుల వరకు చేరుకుంటాయనీ, అది తన భద్రతకు ప్రమాదకరమని రష్యా భావిస్తోంది. నాటోకూ రష్యాకూ మధ్య తటస్థ దేశంగా ఉక్రెయిన్ ఉండాలన్నది మాస్కో అభిమతం. 2021లో తన షరతులను అమెరికా, నాటోలు తోసిపుచ్చడంతో- 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా ప్రత్యేక సైనిక చర్య తీసుకుంది. ఇది పూర్తిస్థాయి యుద్ధమని అమెరికా, నాటోలు భావించాయి.

### అండదండలు అందించినా...

రష్యా సేనలు ఉక్రెయిన్‌ను కొద్ది వారాల్లోనే లొంగదీస్తాయని మొదట్లో అంచనాలు వినవచ్చాయి. కానీ, మాస్కోను ఆర్థికంగా, సైనికంగా బలహీనపరచాలని అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్‌కు అండగా నిలిచాయి. ఆర్థికంగా, సైనికంగా తోడ్పడటంతో పాటు నిఘా సమాచారాన్నీ ఉక్రెయిన్‌కు అందించాయి. అమెరికా, ఐరోపా బ్యాంకుల్లోని రష్యా డిపాజిట్లను స్తంభింపజేశాయి. ఆ దేశ చమురు ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. ఉక్రెయిన్ భుజంపై తుపాకీపెట్టి రష్యాను కాల్చసాగాయి. 2025 సంవత్సరాంతం వరకు అమెరికా పార్లమెంటు ఉక్రెయిన్‌కు 18,800 కోట్ల డాలర్ల నిధులు అందించి ఆయుధ కొనుగోళ్లకు సహకరించింది. అంతకుముందు 2024 చివర్లో అమెరికా ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రెండు వేలకోట్ల డాలర్ల రుణం ఇప్పించింది. దానికయ్యే వడ్డీని రష్యన్ డిపాజిట్ల నుంచి చెల్లించే ఏర్పాటూ చేసింది! యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు ఐరోపా సమాఖ్య(ఈయూ) ఆర్థిక, మానవతా సాయం రూపంలో 10,400 కోట్ల యూరోలను అందించింది. రష్యా దూకుడును అమెరికా, నాటోలు తగ్గించగలిగాయే గానీ, ఉక్రెయిన్ నుంచి మాస్కో సేనలు వెనుదిరిగేలా చేయలేకపోయాయి. ఉక్రెయిన్ తూర్పు ప్రాంతాలతోపాటు డొనెట్స్క్, లుహాన్స్క్, జపోరిజియా, ఖేర్సన్‌లను కూడా మాస్కో ఆక్రమించేసింది. బైడెన్ హయాంలో అమెరికా, నాటోలు రష్యాపై సైనిక, ఆర్థిక మార్గాల్లో విజయం సాధించాలని పట్టుదలగా ఉండేవి. ట్రంప్ అధ్యక్షుడైన తరవాత పరిస్థితి మారిపోయింది. యుద్ధాన్ని నిలిపేసిన నేతగా చరిత్రలో నిలిచిపోవాలని ఆయన ఆరాటపడుతున్నారు. నిరుడు రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతిసయోధ్యల సాధనకు ట్రంప్ తనదైన శైలిలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మొన్న ఆగస్టులో అలాస్కాలో జరిగిన ట్రంప్, పుతిన్‌ల శిఖరాగ్ర సమావేశం కూడా యుద్ధానికి తెరదించలేకపోయింది. వాషింగ్టన్ మధ్యవర్తిత్వంలో రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరిగిన చర్చలూ ఫలించలేదు. ఎవరూ వెనక్కి తగ్గకపోవడం, రాజీ పడటానికి సిద్ధంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోరాదనీ; యుద్ధం ముగిసిన తరవాత కూడా ఉక్రెయిన్ భద్రతకు నాటో పూచీ తీసుకోరాదనీ... తనపై విధించిన ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలనీ; ఇప్పుడు తన ఆధీనంలోకి వచ్చిన తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాలను తిరిగిచ్చేది కూడా లేదనీ రష్యా భీష్మించుకుని కూర్చుంది! ఈ ప్రాంతాలు ఉక్రెయిన్ భూభాగంలో అయిదో వంతుకు సమానం. ఇది కాకుండా 2014లో రష్యా ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనం చేసుకుంది. దాన్ని రష్యా అంతర్భాగంగా అంతర్జాతీయ సమాజం గుర్తించాలని మాస్కో డిమాండ్ చేస్తోంది. దీనికి ఉక్రెయిన్ ససేమిరా అంటున్నా, ట్రంప్ మాత్రం ఆయా భూభాగాలను రష్యాకు ధారాదత్తం చేసేందుకు సుముఖంగానే ఉన్నారు! ఐరోపా దేశాలు మాత్రం ఉక్రెయిన్‌కు బాసటగా నిలుస్తున్నాయి. ఉక్రెయిన్ భూభాగాలను కలిపేసుకోవడానికి రష్యాను అనుమతిస్తే, భవిష్యత్తులో ఇతర దేశాలూ అలాగే చేస్తాయని వాదిస్తున్నాయి.

### భారత్‌కు తప్పని తలనొప్పులు!

ఉక్రెయిన్ యుద్ధం ఇండియాను ఇరకాటంలోకి నెట్టింది. భారత్‌కు రష్యా, ఉక్రెయిన్‌లతో స్నేహ సంబంధాలు ఉన్నాయి. యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా నుంచి తగ్గింపు ధరలకు చమురు కొనవద్దనీ, మాస్కో తీరును ఖండించాలనీ అమెరికా, ఐరోపా దేశాల నుంచి న్యూఢిల్లీపై ఒత్తిడి పెరిగింది. భారత్ అందుకు అంగీకరించకుండా, తన ఇంధన భద్రత కోసం రష్యన్ చమురును కొనుగోలు చేస్తూనే ఉంది. ఉక్రెయిన్‌పై దండెత్తినందుకు రష్యాను ఖండించలేదు గానీ, ఇవి యుద్ధాలకు రోజులు కావనీ, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని హితవు చెప్పింది. బైడెన్, ఐరోపా నాయకులు మొదట్లో భారత వైఖరితో సర్దుకుపోయారు. అయితే, ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటే భారత్‌పై 25శాతం 'జరిమానా సుంకాలు' విధిస్తానని నిరుడు ఆగస్టులో ప్రకటించారు. దాంతో మొత్తం సుంకాలు 50శాతానికి చేరాయి. ఇది భారత్-అమెరికా సంబంధాలను ఒత్తిడికి గురిచేసింది. కానీ ఈ ఫిబ్రవరిలో సుంకాలను 18శాతానికి తగ్గించడం, త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రకటించడం పరిస్థితిని కాస్త ఉపశమింపజేసింది. ఏదిఏమైనా, అంతూపొంతూ లేకుండా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ సమరాన్ని ముగించడానికి అంతర్జాతీయ సమాజం గట్టి పూనిక వహించాలి.

# తెలంగాణ సాయుధ పోరాటం.. కవిత్వంలో విప్లవ ధ్వని

తెలంగాణ సాయుధ పోరాటం (1946-1951) భారత చరిత్రలో ఒక అసాధారణ అధ్యాయం. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అరాచకాలు, వెట్టి చాకిరి వ్యవస్థలో మునిగిపోయిన రైతాంగం భూమి, భుక్తి కోసం ఆయుధాలు పట్టుకుని లేచి నిలబడిన సమయం ఇది. ఈ పోరాటం కేవలం రక్తపు సంఘర్షణకు మాత్రమే పరిమితం కాదు. అది సాహిత్యం, కళల్లో కూడా ప్రతిధ్వనించింది.

ముఖ్యంగా తెలుగు కవిత్వం ఈ విప్లవాన్ని గ్రామీణ భాషలో, ప్రజా రూపాల్లో ఆకృతి చేసింది. కవులు ఒక చేత్తో తుపాకీ, మరొక చేత్తో పెన్ను పట్టుకుని పోరాడారు.

సాయుధ పోరాటానికి మూలం..

ప్రజా కవిత్వం, గేయకవిత్వం రూపాల్లో వచ్చిన ఈ రచనలు పోరాటాన్ని ఉత్తేజపరిచాయి, తర్వాత జాతీయ చైతన్యాన్ని రేకెత్తించాయి. ఈ సమీక్షా వ్యాసంలో ప్రసిద్ధ కవితలను ఉదహరిస్తూ, వాటి పంక్తులను కోట్ చేస్తూ, ఆ విప్లవ కవిత్వం యొక్క స్ఫూర్తిని చర్చిస్తాం. తెలంగాణ సాయుధ పోరాటం కవిత్వానికి మూలం ప్రజా ఉద్యమాల్లోనే. నైజాం రాజ్‌లో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు ప్రజలను జాగృతం చేసినప్పుడు, కవిత్వం మొదటి ఆయుధంగా మారింది. గ్రామీణ జానపద రూపాలు, పల్లెటూరి భాషా సౌరభం ఈ కవిత్వాన్ని ప్రజలకు అనుసంధానం చేశాయి. పోరాటం సమయంలో వేలాది పాటలు, గేయాలు పుట్టాయి. ఇవి కేవలం ఉత్తేజకరమైనవి కాదు; దోపిడీ యొక్క కారుణ్యం, విప్లవ యొక్క ఆశాభావన, త్యాగం యొక్క మహత్త్వాన్ని వర్ణించాయి. ప్రముఖ కవి దాశరథి రంగాచార్య లాంటి వారు ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొని, జైలు జీవితాలు గడిపారు. వారి కవిత్వం పోరాటాన్ని ఆకృతి చేసింది.

దాశరథి రంగాచార్య (1928-2015)

తెలంగాణ కవిత్వానికి ప్రతీక. సాయుధ పోరాట యోధుడై, అభ్యుదయవాది, ప్రజాకవిగా ప్రసిద్ధి. ఆయన "బూటు" కవిత పోరాటానికి ప్రతీకాత్మకం. రాజకారుల బూట్లు ప్రజల రక్తంతో తడిసి, దోపిడీని సూచిస్తూ, విప్లవాన్ని ధిక్కరిస్తుంది. కవితలో: "బూటు బూటు రెండు బూట్లు / రక్తంతో తడిసిన రెండు బూట్లు / ప్రజల రక్తంతో తడిసిన బూట్లు" అని పంక్తులు పోరాట యొక్క క్రూరత్వాన్ని గుర్తుచేస్తాయి. ఇది ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించి, గెరిల్లా పోరాటానికి ప్రేరణ. మరొక ప్రసిద్ధ కవిత "నా తెలంగాణా"లో ఆయన త్యాగాన్ని ఆకాశతారలతో పోల్చి: "తీగలను తెంపి అగ్నిలో దింపినావు / నా తెలంగాణా కోటి రత్నాల వీణ" అని రాశారు. ఈ పంక్తులు తెలంగాణను వీణగా, పోరాటాన్ని సంగీతంగా చిత్రీకరిస్తాయి. దాశరథి కవిత్వం భావోద్వేగ స్ఫూర్తితో కూడినది, పోరాటాన్ని వ్యక్తిగత అనుభవంగా మలిచింది.

కాళోజీ నారాయణరావు (1914-2002)

ప్రజాకవిగా, తెలంగాణ ఉద్యమాల ప్రతిధ్వనిగా నిలిచారు. స్వాతంత్ర్య పోరాటం నుండి తెలంగాణ సాయుధ పోరాటం వరకు అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయన "నిజామ్" కవితలో రజాకార్ల క్రూరత్వాన్ని ధిక్కరిస్తూ: "నిజామనగ ఎంతరా / వాడి తహతెంతరా /



అంతగలసి తంతె మల్ల వాడి అంతులేదురా" అని రాశారు. ఈ పంక్తులు నిజాం పాలన యొక్క అంధకారాన్ని, పోరాట యొక్క అవసరాన్ని స్పష్టం చేస్తాయి. భైరంపల్లి హత్యకాండం గురించిన కవితలో కాళోజీ మహిళల త్యాగాన్ని వర్ణిస్తూ, పోరాటాన్ని జాతీయ స్థాయికి ఎత్తారు. ఆయన కవిత్వం సామాజిక న్యాయం, ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలతో ముడిపడి ఉంది. పోరాటం తర్వాత కూడా "పోరు తెలంగాణ" గీతం లాంటి రచనలు ప్రజల్లో ఐక్యతను నింపాయి. కాళోజీ కవిత్వం ధిక్కార భావంతో కూడినది, ఉద్యమ స్ఫూర్తిని శాశ్వతం చేసింది.

సుద్దాల హన్మంతు (1910-1982)

తెలంగాణ ప్రజా కవిత్వానికి మూలస్తంభం. కమ్యూనిస్టు యోధుడుగా, కళాకారుడుగా పోరాటంలో ముందువరసలో నిలిచారు. ఆయన "పల్లెటూరి పిల్లగాడా" పాట కరుణరసంగా ప్రజల బాధలను చిత్రీకరిస్తుంది: "పల్లెటూరి పిల్లగాడా / పసులగాసె మొనగాడా / పాలు మరిచి ఎన్నాళ్ళయింది / ఓడ పాల బుగ్గల జీతగాడా / కొలువు కుదిరి ఎన్నాళ్లయింది." ఈ పంక్తులు రైతు పిల్లల దుస్థితిని, వెట్టి చాకిరి యొక్క దారుణత్వాన్ని గుర్తుచేస్తూ, పోరాటానికి చోదకంగా మారాయి. మరొక ప్రసిద్ధ గేయం "వేయ్ దెబ్బ... దెబ్బకు దెబ్బ" రాజకారుల దాడులకు ప్రతిఘటనగా రాసినది. ఇది గెరిల్లా యుద్ధ వ్యూహాన్ని ప్రతిబింబిస్తూ, "రణభేరి మ్రోగింది తెలుగోడ" లాంటి పంక్తులతో యోధులను ఉత్తేజపరిచింది. హన్మంతు కవిత్వం జానపద రసాలతో కూడినది, ప్రజల నోటిలో నాని, పోరాటాన్ని సామూహిక గాథగా మలిచింది.

సోమసుందర్ (1924-2016)

అభ్యుదయవాద కవిగా, "వజ్రాయుధం" (1949) ద్వారా తెలంగాణ పోరాటాన్ని మహాకావ్యాంగంగా ఆకృతి చేశారు. ఈ గేయకవిత భూస్వామ్య వ్యవస్థను త్రోసిరాజని, బానిసల దండయాత్రను వర్ణిస్తుంది. కవితలో: "బానిసల దండయాత్ర / ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవిస్తారు / ఒక నెత్తుటి బొట్టులో ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లుతాయి" అని పంక్తులు త్యాగాన్ని ఆశాగీతంగా మలిచాయి. జనగామ, బాలేముల, నల్లగొండల్లో జరిగిన వీరోచిత పోరాటాలను ఉద్వేగంగా చిత్రీకరించారు. సోమసుందర్ కవిత్వం బూర్జువా వ్యవస్థను విమర్శిస్తూ, ప్రజావాద భవిష్యత్తును ఊహిస్తుంది. ఇది పోరాటాన్ని రాజకీయ దృక్పథంతో చూసే ఒక మైలురాయి. ఆరుద్ర (శ్రీశ్రీ అనంతర కవులలో) "త్వమేవాహం" మహాకావ్యంలో తెలంగాణ పోరాట తీవ్రతను వర్ణించారు. ఇక్కడ పోరాటం ఆత్మవిశ్వాసంగా, ప్రజల ఐక్యతగా చిత్రీకరించబడింది. మఖ్దూం మొహియుద్దీన్ ఉర్దూ కవిత్వంలో నిజాం వ్యతిరేక భావాలు ప్రచారం చేశారు, తెలుగు కవిత్వానికి ప్రభావం చూపారు.

విప్లవ చైతన్యానికి మార్గదర్శకం

ఈ కవిత్వం తెలంగాణ సాయుధ పోరాటాన్ని సాహిత్యంగా ఆకర్షించడమే కాక, భారతీయ విప్లవ చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచింది. దోపిడీకు వ్యతిరేకం, త్యాగానికి నివాళి, భవిష్యత్తుకు ఆశలు ఇవి ఈ రచనల మొదటి ధ్వనులు. పోరాటం ముగిసినా, ఈ కవితలు తెలంగాణ గుర్తింపును బలపరిచాయి. ఈ విప్లవ ధ్వని ఈరోజు కూడా ప్రజల్లో ప్రతిధ్వనిస్తోంది, సామాజిక న్యాయ పోరాటాలకు ప్రేరణగా మారుతోంది. తెలంగాణ కవిత్వం ఆయుధాల కంటే బలమైనది, ఎందుకంటే అది మనసుల్ని మార్చింది.

# పీడక పాలన నుంచి 'సేవ్ తెలంగాణ'

కరువు కాలం మీద పడి తరుముతుంటే.. తెలంగాణ జనం వలవల ఏడ్సుకుంట బొంబాయ్, దుబాయ్ వలసలు పోతున్నప్పుడు చూసి గుండెలు బాదుకున్నోడు కేసీఆర్. పల్లెపల్లెన పల్లేర్ల దారులు..బీడుబారిన పొలాలు.. పొక్కిలైన వాకిళ్లు..కన్నీరింకిన ముఖాలు చూసి బావురుమన్నోడు కేసీఆర్. ఆ వలపోత నుంచి, ఆ దుఃఖధార నుంచి పుట్టిన నినాదమే 'జై తెలంగాణ'. దగాపడిన వర్గాలతో దండుకట్టించి, తిరుగుబాటు జెండా పట్టించి, బరిగీసి కొట్లాడి తెలంగాణ తెచ్చింది కేసీఆర్. ఆయన ఎవరికి జాతిపిత అని ఇప్పుడు అడుగుతున్నవాళ్లు..పల్లెపల్లె పిడికిళ్లెత్తిననాడు ఎక్కడున్నరు? 'సారు'తో గొంతు కలిపి జై తెలంగాణ అని ఒక్కరోజైనా నినదించిండ్రా? ఇయ్యాల పచ్చబడ్డ తెలంగాణ మీద పెత్తనం చేస్తున్నరు. చేయనీ..! జనం బమిసిండ్రు..ఓటేసిండ్రు. అధికారం ఇచ్చిండ్రు. అధికారం దొరికినప్పుడు ఎట్ల చేయాలె? పాడి బర్రె తీరు రాష్ట్రాన్ని సాకి సవరిచ్చి ఇంకింత పెంపు చేయాలె. ఎకరం ఎక్కువ పారించో..బస్తా ఎక్కువ పండించో.. చూపించాలె. గోదు, గోస లేని రాజ్యంగా నిలబెట్టాలె. రెట్టింపు సంక్షేమాన్ని, సంతోషాన్ని నింపాలె, అంతకుముందు పాలించిన పాలకుడిని మరిపించాలె. అగో..! అదీ పరిపాలన తరీక.తెలంగాణ వార్తలు కాంగ్రెస్ రెండేండ్ల ఏలుబడి ఏం చేసింది? 880 మంది రైతులను మింగింది. 126 మంది పసిపిల్లల చావులతో బడులనే వల్లకాడు చేసింది. తెలంగాణను మళ్లీ మృత్యుముఖంలో నిలిపింది. పల్లెపల్లెన మళ్లీ చావు డప్పు మోగించింది. అయినా ఈ మానవ పెను హననంతో వారికేం పని? ఖజానాల పద్ద ఇత్తు పడ్డట్టుగా కడగ నాకాలె. అంతో ఇంతో మిగిల్తే ఢిల్లీకి మూట గట్టాలె. అంతకుమించి ఈ తెలంగాణతో వాళ్లకేం పని? ఇక్కడి జీవితాలతో వాళ్లకేం పట్టి? అధికారం అప్పజెప్పిన పొద్దు నుంచి ఈ పొద్దు వరకు గురుకులాలే మృత్యుకుహరాలై..126 మంది పసిబిడ్డల గొంతు నులిమింది. 'సారు' పూనుకొని, సాగును సక్కదిద్ది, సావు కోరల నుంచి రైతును బయటకు తీసినట్టే అనుకున్న ఆనందం కండ్ల ముందే ఆవిరైపోతున్నది. భరోసా దొరకని రైతు మళ్లీ చావు దిక్కే మొగ్గుతున్నడు. మిత్తికి పోయి, అప్పులపాలై బలవన్మరణాల బాట పడుతున్నడు. కేసీఆర్ దిగిపోయే చివరి ఏడాది నాటికి రైతు ఆత్మహత్యలను 56కు కుదించి ఆకుపచ్చ తెలంగాణను కాంగ్రెస్ పాలకుల చేతుల్లో పెట్టిండు. వాళ్లేమో ఈ రెండేండ్లలో 880 మంది రైతు ఆత్మహత్యలను ముందు పెట్టిండ్రు. కట్టుకున్న ఇండ్లను పట్టపగలే పాలకుల బుల్డోజర్ నేలమట్టం చేస్తుంటే దిక్కుతోచక బిక్కచచ్చిన జనం గగ్గోలు పెడుతున్నరు. ఆయన కొలువు కూటం మీదకి ఎక్కిన దినం నుంచి ఖమ్మం జిల్లా వెలుగుమట్ల విధ్వంసం వరకు 4 వేల ఇండ్లు కూలగొట్టినట్టు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ లెక్కలు చెప్తున్నది. మూసీ ప్రక్షాళన పేరుతో మరో 10,017 వేల ఇండ్లు నేలమట్టం చేసేదాకా నిద్రపోమని ఏలికలు గెజిట్ పత్రం పట్టుకొని తిరుగుతున్నరు. సింగపూర్ కన్సల్టెంట్లు రూపొందించిన ప్రజెంటేషన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాలిలో గ్రాఫిక్స్ మేడలు కడుతుంటే..అచ్చంగా అమరావతి డిజైన్ల చంద్రబాబే పూనినట్టు అనిపించింది. మూసీ బాధిత జనులను, వారికి అండగా నిలిచిన ఉద్యమకారులను గృహనిర్బంధం చేసి శుక్రవారం తాజ్ కృష్ణా హోటల్‌లో కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య చేసిన గ్రాఫికల్ పవర్ పాయింట్‌లో రేవంత్‌లో ఆసాంతం అబ్రకదబ్ర చంద్రబాబు నాయుడే కనిపించాడు. అభివృద్ధిని విస్మరించి, విధ్వంసాలను విస్తరించాలనే కుతూహలాన్ని..ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో నింపేసిన పవర్ పాయింట్ రంగులరాట్నం బయటపెట్టింది. 2025 డిసెంబర్‌లో రైతుల ఖాతాల్లో జమ చేయవలసిన రైతు భరోసా డబ్బులు 2026 మార్చి వరకు కూడా దిక్కులేదు. ఇంకో నెల రోజులు పోతే ఖరీఫ్ సీజన్ అందుకుంటది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిపోతున్నది. ఎన్ని దేవుండ్ల మీద ఒట్టేసి చెప్పినా..ఇప్పట్లో ఇచ్చే సూచనలైతే కనిపించటం లేదు. 'నేనైతే రైతు భరోసా వేసిన! కానీ రైతుల ఖాతాల్లో పడ్డయో, లేదో నాకైతే తెల్వది' అని ముఖ్యమంత్రి అమాయకపు ప్రకటన వెనుక మర్మమేమిటి? కేసీఆర్ ఉన్నప్పుడు సరిగ్గా నాటుకు, నాటుకు మధ్య రైతుబంధు పడ్డది. రేవంత్‌రెడ్డి వచ్చి ఓటుకు, ఓటుకు మధ్య భరోసా పెట్టిండు. ఎప్పుడు ఓట్లొస్తే అప్పుడు, ఎక్కడ ఓట్లొస్తే అక్కడ నిధులు జమ చేస్తున్నడని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే ముఖ్యమంత్రి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు..'కేసీఆర్ రైతుబంధు రూ.5 వేల చొప్పున

## LPG సిలిండర్లను ఇంట్లో నిల్వ చేసుకుంటున్నారా? జైలు శిక్ష తప్పదు! రూల్స్ తెలుసుకోండి!



మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్పీజీ గ్యాస్ లభ్యతపై ఆందోళన ఉన్నా, అదనపు సిలిండర్లను నిల్వ చేయడం చట్టవిరుద్ధం, ప్రమాదకరం. భారతదేశంలో 'ఒక ఇల్లు -- ఒక కనెక్షన్' విధానం అమలులో ఉంది. వినియోగదారులు డబుల్ సిలిండర్ కనెక్షన్ (ఐదీజ) ద్వారా రెండు సిలిండర్లు పొందవచ్చు. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు సమస్యల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ గ్యాస్ లభ్యతపై కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో కొంతమంది అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసుకోవాలని భావిస్తున్నారు. అయితే ఇది ప్రమాదకరమైనదే కాకుండా చట్టవిరుద్ధమైన చర్యగా కూడా పరిగణించబడుతుంది. ప్రభుత్వం, చమురు కంపెనీలు ఎల్పీజీ కనెక్షన్లు, సిలిండర్ నిల్వపై కఠిన నియమాలను అమలు చేస్తున్నాయి. భారతదేశంలో సాధారణంగా ఒక ఇల్లు -- ఒక కనెక్షన్ అనే విధానం అమల్లో ఉంటుంది. అంటే ఒక ఇంటి చిరునామాకు ఒక ఎల్పీజీ కనెక్షన్ మాత్రమే చెల్లుబాటు అవుతుంది. దేశంలో ప్రధానంగా మూడు కంపెనీలు గృహ గ్యాస్ సేవలను అందిస్తున్నాయి. అవి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇండేన్ గ్యాస్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ హెచ్‌పీ గ్యాస్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ భారత్ గ్యాస్. ఒక వినియోగదారుడు ఇప్పటికే ఒక కంపెనీ నుండి గ్యాస్ కనెక్షన్ తీసుకున్నట్లయితే అదే చిరునామాలో మరో కంపెనీ నుండి కనెక్షన్ తీసుకోవడం చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుంది. అయితే వినియోగదారులు తమ కనెక్షన్‌ను డబుల్ సిలిండర్ కనెక్షన్ (డీబీసీ)గా మార్చుకోవచ్చు. ఈ విధానంలో ఒకే కనెక్షన్ కింద రెండు సిలిండర్లు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా గృహ వినియోగదారులకు ఒక సిలిండర్ వాడకం కోసం, మరొకటి రిజర్వ్‌గా ఉండేలా రెండు సిలిండర్లు అనుమతిస్తారు. నిబంధనల ప్రకారం ఒక వినియోగదారుడు సంవత్సరానికి గరిష్టంగా 15 గృహ సిలిండర్లను పొందవచ్చు. అయితే అవసరానికి మించి సిలిండర్లను సేకరించడం లేదా చెల్లుబాటు అయ్యే అనుమతి లేకుండా 40 కిలోగ్రాములకంటే ఎక్కువ ఎల్పీజీ నిల్వ చేయడం చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుంది. అటువంటి పరిస్థితుల్లో పరిపాలన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అక్రమంగా సిలిండర్లను నిల్వ చేయడం లేదా బ్లాక్ మార్కెటింగ్‌లో పాల్గొన్నట్లు తేలితే గ్యాస్ కనెక్షన్ రద్దు చేయడం, భారీ జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకోవచ్చు. తీవ్రమైన సందర్భాల్లో ఈ కేసులు ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద నమోదు కావచ్చు. ఈ చట్టం ప్రకారం నిందితులకు 3 నెలల నుంచి 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

## బంగారం కొనేవారికి కేంద్రం అదిరిపోయే గుడ్ న్యూస్.. ఈ ఒక్క నిర్ణయంతో భారీగా తగ్గనున్న ధరలు..!



గత కొంతకాలంగా ఆకాశమే హద్దుగా పెరుగుతున్న బంగారం ధరల మధ్య పసిడి ప్రియులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న మధ్యతరగతి ప్రజలకు, ఆభరణాల వ్యాపారులకు ఊరటనిస్తూ.. బంగారం బేస్ దిగుమతి ధరను తగ్గిస్తూ మోదీ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా బంగారం ధరల పెరుగుదలతో ఆందోళన చెందుతున్న మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. అంతర్జాతీయ మార్కెట్లో ధరల అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం బంగారం బేస్ దిగుమతి ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణ సెగతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ప్రభుత్వం 10 గ్రాముల బంగారంపై బేస్ దిగుమతి ధరను 12 డాలర్ల మేర తగ్గించింది. గతంలో 1664 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు అది 1652 డాలర్లకు చేరింది.

**బేస్ దిగుమతి ధర అంటే ఏమిటి? దీని వల్ల లాభమేంటి?**

సాధారణంగా దేశంలోకి దిగుమతి అయ్యే బంగారంపై కస్టమ్స్ సుంకం మరియు ఇతర దిగుమతి పన్నులను లెక్కించడానికి ప్రభుత్వం ఒక నిర్దిష్ట ధరకు ప్రామాణికంగా తీసుకుంటుంది. దీనే టారిఫ్ విలువ లేదా బేస్ దిగుమతి ధర అంటారు. ఇప్పుడు ఈ బేస్ ధర తగ్గడం వల్ల దిగుమతిదారులపై భారం తగ్గి.. దేశీయ మార్కెట్లోకి బంగారం తక్కువ ధరకు చేరుతుంది. అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గుల వల్ల పెరిగిన ఖర్చులను ఎదుర్కొంటున్న జువెలర్స్ మరియు బులియన్ వ్యాపారులకు ఈ నిర్ణయం పెద్ద మద్దతుగా నిలుస్తుంది. దిగుమతి ఖర్చులు తగ్గడంతో, ఆభరణాల వ్యాపారులు ఆ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేసే అవకాశం ఉంది. తద్వారా దేశీయంగా బంగారం ధరలు కొంతమేర తగ్గే ఛాన్స్ ఉంది.

**ఎందుకు ఈ నిర్ణయం?**

అంతర్జాతీయ ధోరణులకు అనుగుణంగా దేశీయ మార్కెట్ ధరలను సమతుల్యం చేయడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఈ సవరణలు చేసింది. మన దేశీయ మార్కెట్ అంతర్జాతీయ మార్కెట్లతో పోటీ పడేలా ఉండటం మరియు వినియోగదారులపై ధరల ఒత్తిడిని తగ్గించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యం. ఈ నిర్ణయం రాబోయే రోజుల్లో ఈ ప్రభావం దేశీయ రిటైల్ మార్కెట్‌పై ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## కారు కొనాలనుకుంటున్నారా? అయితే ఈ గుడ్‌న్యూస్ మీకే! రూ.50000 తగ్గింపు




కియా భారత మార్కెట్లో మార్చి 2026 వరకు పలు కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం ముగిసే ముందు కారు కొనాలనుకునే వారికి ఇది సువర్ణావకాశం. సోనెట్, సెల్టోస్, కారెన్స్ వంటి మోడళ్లపై నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ ప్రయోజనాలతో కలిపి రూ.50,000 వరకు ఆదా చేసుకోవచ్చు. దక్షిణ కొరియా ఆటోమొబైల్ కంపెనీ కియా భారత మార్కెట్లో మార్చి 2026 వరకు తన పలు కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం ముగిసే ముందు కారు కొనాలనుకునే వినియోగదారులను ఆకర్షించడానికి కంపెనీ ఈ ఆఫర్లను అందిస్తోంది. కొన్ని మోడళ్లపై మొత్తం ప్రయోజనం రూ.50,000 వరకు ఉండే అవకాశం ఉంది. కియా సోనెట్ కాంపాక్ట్ ఎస్‌యూవీపై మొత్తం రూ.30,000 వరకు డిస్కౌంట్ లభిస్తోంది. ఇందులో రూ.10,000 క్యాష్ తగ్గింపు, రూ.10,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.10,000 కార్పొరేట్ బెనిఫిట్స్ ఉన్నాయి. ఈ మోడల్ భారత మార్కెట్లో టాటా నెక్సాన్, హ్యుందాయ్ వెన్యూ, మారుతి సుజుకి బ్రెజ్జా వంటి ఎస్‌యూవీలతో పోటీ పడుతోంది. మిడ్ సైజ్ ఎస్‌యూవీ అయిన కియా సెల్టోస్ కొనుగోలు చేసే వారికి రూ.20,000 ఎక్స్ఛేంజ్ బోనస్‌తో పాటు ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్యాకేజ్ అందుబాటులో ఉంది. ఈ వాహనం హ్యుందాయ్ క్రెటా, హోండా ఎలివేట్, స్కోడా కుషాక్ వంటి కార్లతో మార్కెట్లో పోటీపడుతోంది. కొత్త ఎస్‌యూవీ అయిన కియా సైరోస్ పై మొత్తం రూ.40,000 వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. ఇందులో రూ.10,000 క్యాష్ తగ్గింపు, రూ.20,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.10,000 కార్పొరేట్ ఆఫర్ ఉన్నాయి.

## 25 వేల రైళ్లను ఇండియన్ రైల్వేస్ ఎలా నిర్వహిస్తోంది? మైండ్‌బ్లాంక్ అయ్యే విషయాలు..!



భారతీయ రైల్వేలు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద నెట్‌వర్క్‌గా సమయపాలన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ట్రాక్ నిర్వహణ, వాతావరణం, సాంకేతిక సమస్యల వల్ల ఆలస్యాలు జరుగుతున్నప్పటికీ, రైల్వేలు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాయి. డేటా లాగర్‌లు, ఆధునిక నిర్వహణ పద్ధతులు, మౌలిక సదుపాయాల మెరుగుదలతో రైళ్ల రాకపోకలు మెరుగుపడి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. భారతీయ రైల్వేలు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద రైలు నెట్‌వర్క్‌గా గుర్తింపు పొందాయి. లక్షలాది మంది ప్రయాణికులను ప్రతి రోజు గమ్యస్థానాలకు చేర్చేందుకు రైల్వే ఉద్యోగులు నిత్యం విధుల్లో ఉంటారు. రోజుకు సుమారు 25,000 రైళ్లను సురక్షితంగా నడపడం ద్వారా అధిక స్థాయి కార్యాచరణ విశ్వసనీయతను రైల్వేలు కొనసాగిస్తున్నాయి. అయితే రైల్వే ట్రాక్‌ల నిర్వహణ పనులు, పొగమంచు పరిస్థితులు, చెడు వాతావరణం, మార్గ అడ్డంకులు, గొలుసు లాగడం, నిరసనలు, ట్రాక్‌లపై పశువులు చిక్కుకోవడం వంటి కారణాలు రైళ్ల సమయపాలనను ప్రభావితం చేస్తాయి. ప్రయాణికుల రైళ్లు, సరుకు రైళ్లు సకాలంలో నడిచేలా భారతీయ రైల్వేలు పలు చర్యలు చేపడుతున్నాయి. రైల్వే ఉద్యోగులు డివిజనల్, జోనల్, రైల్వే బోర్డు స్థాయిలో ప్యాసింజర్ రైళ్ల నడకను కఠినంగా పర్యవేక్షిస్తున్నారు. ఆస్తుల విశ్వసనీయతను పెంచడానికి వాటి నిర్వహణ కోసం రోలింగ్ బ్లాక్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టడం, ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల అడ్డంకులను తొలగించడం, శాస్త్రీయ పద్ధతిలో టైమ్ టేబుల్‌ను హేతుబద్ధీకరించడం వంటి చర్యలు అమలు చేస్తున్నారు. ప్యాసింజర్ రైళ్ల రాకపోకలను నిజ సమయంలో గుర్తించడానికి డేటా లాగర్‌లను ఉపయోగిస్తున్నారు. సాంకేతికత, మెరుగైన మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రైల్వే ఆస్తుల విశ్వసనీయతను పెంచుతున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల లోకోస్, ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓహెచ్‌ఈ) వంటి వ్యవస్థల్లో వైఫల్యాల శాతం దాదాపు 2 శాతానికి పరిమితమైంది. రైల్వే మార్గదర్శకాల ప్రకారం ట్రాక్, రోలింగ్ స్టాక్, ఓహెచ్‌ఈ, సిగ్నలింగ్ వంటి అన్ని ఆస్తులను సకాలంలో తనిఖీ చేసి నిర్వహణ చేపడతారు. జోనల్ రైల్వేలలో ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షిస్తున్నారు. నివారణ నిర్వహణ చర్యల ద్వారా రైళ్ల భద్రతను కూడా నిర్ధారిస్తున్నారు. రైల్వేలు ప్రత్యేక సమయపాలన డ్రైవ్‌లను నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాయి. డీజిల్ లోకోమోటివ్‌లు, ఓహెచ్‌ఈ వైఫల్యాలు, సిగ్నల్ సమస్యలు, ట్రాక్ లోపాలు, రద్దీ, రోలింగ్ స్టాక్ సమస్యల వల్ల జరిగే ప్రతి రైలు ఆలస్యాన్ని అధికారులు విశ్లేషించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటారు. రైళ్ల సజావుగా నడవడానికి ట్రాక్ స్థిరత్వం, డ్రైనేజీ మెరుగుపరచేందుకు బ్యాలస్ట్ లోతైన స్క్రీనింగ్ నిర్వహిస్తారు. అధిక సామర్థ్యంతో పనిచేసే బ్యాలస్ట్ క్లీనింగ్ మెషీన్లు (బీసీఎంలు) ఉపయోగించి ఈ పనిని చేస్తారు. హై అవుట్‌పుట్ బ్యాలస్ట్ క్లీనింగ్ మెషీన్లు (హెచ్‌ఓబీసీఎంలు) ఉపయోగించడం ద్వారా తక్కువ మాన్యువల్ జోక్యంతో ట్రాక్ బ్యాలస్ట్ బెడ్‌ను సమర్థవంతంగా, సమానంగా శుభ్రపరచడం సాధ్యమవుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

## ఎస్బీఐలో రూ.75లక్షల హోమ్ లోన్ రావాలంటే ఎంత జీతం ఉండాలో తెలుసా..?



మధ్యతరగతి ప్రజల అతిపెద్ద కల.. ఒక సొంత ఇల్లు. ఆ కలను సాకారం చేసుకునే క్రమంలో హోమ్ లోన్ ఒక వరంగా మారుతుంది. అయితే గతంలో ఆకాశాన్ని తాకిన వడ్డీ రేట్లు.. ఇప్పుడు కొద్దిగా తగ్గాయి. ఈ క్రమంలో రూ.75 లక్షల లోన్ తీసుకోవాలంటే మీ నెలవారీ ఆదాయం ఎంత ఉండాలి? ఏ బ్యాంక్ తక్కువ వడ్డీని వసూలు చేస్తోంది? అనేది తెలుసుకుందాం.. ప్రస్తుతం సొంత ఇల్లు కట్టుకోవడం అనేది మధ్యతరగతి ప్రజలకు ఒక పెద్ద సవాలు. ఈ కలను సాకారం చేసుకోవడానికి మెజారిటీ ప్రజలు హోమ్ లోన్స్‌నే నమ్ముకుంటారు. గత ఏడాది రెపో రేటులో దాదాపు 1.25 శాతం తగ్గడంతో ప్రస్తుతం హోమ్ లోన్స్ వడ్డీ రేట్లు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ఈఎంఐ భారం తగ్గి, రుణగ్రహీతలకు కొంత ఊరట లభిస్తోంది. ప్రస్తుతం దేశంలోని ప్రముఖ బ్యాంకులు 7.10 శాతం నుంచే గృహ రుణాలను ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుతం సుమారు 7.25 శాతం వడ్డీ రేటుతో గృహ రుణాలను అందిస్తోంది. ఉదాహరణకు.. మీరు రాదీ× నుండి 30 ఏళ్ల కాలపరిమితితో రూ.75 లక్షల హోమ్ లోన్ తీసుకుంటే, మీ నెలవారీ ఈఎంఐ సుమారు రూ.51,000 వరకు ఉంటుంది. అయితే కేవలం ఈఎంఐ కట్టడమే కాకుండా మీ కుటుంబ అవసరాలకు కూడా డబ్బు మిగలాలి కాబట్టి బ్యాంకులు మీ ఆదాయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాయి.

**ఎంత జీతం ఉండాలి..?**

సాధారణంగా బ్యాంకులు లోన్ తీసుకునే వారి నికర ఆదాయంలో 40 నుండి 50 శాతం మాత్రమే ఈఎంఐకి కేటాయించేలా చూస్తాయి. దీని ప్రకారం.. మీరు రూ.50,000 ఈఎంఐ చెల్లించాలంటే మీ నెలవారీ జీతం కనీసం రూ.1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. మీకు ఇదివరకే కార్ లోన్ లేదా పర్సనల్ లోన్ వంటి ఇతర రుణాలు ఉంటే, మీకు వచ్చే హోమ్ లోన్ మొత్తం ఇంకా తగ్గే అవకాశం ఉంటుంది.

**వడ్డీ రేట్లు ఇలా..?**

ప్రస్తుతం వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లను పరిశీలిస్తే.. బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యంత తక్కువగా 7.10 శాతానికే రుణాలు ఇస్తోంది. కెనరా బ్యాంక్ 7.15 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 7.20 శాతం, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ సుమారు 7.30 శాతం వడ్డీని వసూలు చేస్తున్నాయి. ఈ రేట్లు మీ క్రెడిట్ స్కోరును బట్టి కొద్దిగా మారే అవకాశం ఉంటుంది.

**సిబిల్ ముఖ్యం**

హోమ్ లోన్ విషయంలో మీ క్రెడిట్ స్కోరు ఒక వజ్రాయుధం లాంటిది. మీ స్కోరు 750 కంటే ఎక్కువగా ఉంటే బ్యాంకులతో చర్చించి వడ్డీ రేటులో మరిన్ని రాయితీలు పొందే అవకాశం ఉంటుంది. అదే స్కోరు తక్కువగా ఉంటే రుణ ఆమోదంలో జాప్యం జరగడమే కాకుండా బ్యాంకులు ఎక్కువ వడ్డీని వసూలు చేసే ప్రమాదం ఉంది. కాబట్టి రుణం తీసుకునే ముందే వడ్డీ రేట్లు, మీ ఆదాయం మరియు ఇతర ఖర్చులను బేరీజు వేసుకోవడం చాలా ముఖ్యం.

## పెట్టుబడిదారులకు గోల్డెన్ ఛాన్స్.. చీఁజులో 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ ప్రారంభం!







నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) మార్చి 16 నుండి 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను ప్రారంభించనుంది. సెబీ ఆమోదంతో, చిన్న పెట్టుబడిదారులు కూడా గోల్డ్ డెరివేటివ్స్ మార్కెట్‌లో సులభంగా పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ కాంట్రాక్ట్ 999 ప్యూరిటీ బంగారం డెలివరీని తప్పనిసరి చేస్తుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) మార్చి 16 నుండి చిన్న పరిమాణంలో గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను ప్రారంభించనుంది. దేశంలోని అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టును ప్రవేశపెడుతోంది. ఈ కొత్త కాంట్రాక్ట్ ప్రారంభంతో చిన్న పెట్టుబడిదారులు కూడా బంగారం ట్రేడింగ్‌లో సులభంగా పాల్గొనే అవకాశం పొందనున్నారు. ఎన్ఎస్ఈ అధికారిక ప్రకటన ప్రకారం కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ట్రేడింగ్ మార్చి 16 నుండి ప్రారంభమవుతుంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పెట్టుబడిదారుల కోసం ఈ కొత్త ప్రొడక్ట్ సిద్ధంగా ఉందని ఎక్స్ఛేంజ్ ప్రకటించింది. ఈ కాంట్రాక్ట్ ప్రారంభానికి ముందు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నుండి అనుమతి కూడా లభించింది.

**కాంట్రాక్ట్ ముఖ్య అంశాలు**
**ట్రేడింగ్ యూనిట్:** 10 గ్రాములు
**డెలివరీ యూనిట్:** 10 గ్రాములు
**కాంట్రాక్ట్ సింబల్:** గోల్డ్10జీ
**కనీస ప్రైస్ మూవ్‌మెంట్:** 10 గ్రాములకు రూ.1

ట్రేడింగ్ సమయం సోమవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 9:00 గంటల నుండి రాత్రి 11:30 లేదా 11:55 వరకు ఉంటుంది. యూఎస్ డేలైట్ సేవింగ్ పీరియడ్ ప్రకారం ఈ సమయం కొద్దిగా మారే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్ట్‌కు రోజువారీ బేస్ ప్రైస్ లిమిట్ 6 శాతంగా నిర్ణయించారు. ఒకవేళ ఈ పరిమితి దాటితే, 15 నిమిషాల కూలింగ్ ఆఫ్ పీరియడ్ తర్వాత దీనిని 9 శాతం వరకు పెంచవచ్చు. ఇది మంత్లీ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్‌గా ఉంటుంది. కాంట్రాక్ట్ గడువు నెల చివరి ట్రేడింగ్ డే వరకు ఉంటుంది. ఆ రోజు హాలిడే అయితే, ముందురోజు వర్కింగ్ డేను చివరి ట్రేడింగ్ డేగా పరిగణిస్తారు. ఈ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్‌లో తప్పనిసరి డెలివరీ విధానం ఉంటుంది. డెలివరీ కోసం 999 ప్యూరిటీ కలిగిన 10 గ్రాముల బంగారం అంగీకరించబడుతుంది. మార్గదర్శకాల ప్రకారం బంగారం ఎల్‌బీఎంఏ (లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్) ఆమోదించిన సప్లయర్ లేదా ఎన్ఎస్ఈ ఆమోదించిన సప్లయర్ నుండి రావాలి. అలాగే క్వాలిటీ సర్టిఫికేషన్ కూడా ఉండాలి. డెలివరీ ప్రక్రియ అహ్మదాబాద్‌లోని ఎక్స్ఛేంజ్ నియమించిన క్లియరింగ్ హౌస్ ద్వారా పూర్తవుతుంది. ఈ కొత్త 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ప్రారంభంతో చిన్న పెట్టుబడిదారులకు గోల్డ్ డెరివేటివ్స్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం మరింత సులభమవుతుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

## గుడ్ న్యూస్.. గ్యాస్ ధరలను భారీగా తగ్గించిన ఆదానీ గ్రూప్.. కొత్త రేట్లు ఇవే







పారిశ్రామిక రంగానికి ఊరటనిస్తూ అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి గ్యాస్ ధరలు తగ్గడంతో ఆ ప్రయోజనాన్ని పారిశ్రామిక వినియోగదారులకు బదిలీ చేస్తూ అదనపు సహజ వాయువు ధరలను భారీగా తగ్గించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్యాస్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పటికీ, పరిశ్రమలపై భారం తగ్గించడమే లక్ష్యంగా కంపెనీ ఈ సవరణ చేపట్టింది. పారిశ్రామిక రంగానికి ఊరటనిస్తూ అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ కీలక ప్రకటన చేసింది. పారిశ్రామిక వినియోగదారులకు సరఫరా చేసే అదనపు సహజ వాయువు ధరలను భారీగా తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయంగా అప్‌స్ట్రీమ్ గ్యాస్ ధరలు తగ్గడంతో ఆ ప్రయోజనాన్ని నేరుగా వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ కొత్త ధరలు మార్చి 16, ఉదయం 6 గంటల నుండి అమలులోకి రానున్నాయి.

**ధరల తగ్గింపు వివరాలు**

పారిశ్రామిక వినియోగదారులు తమ కాంట్రాక్ట్ పరిమితికి మించి వాడే అదనపు గ్యాస్ ధరపై ఈ తగ్గింపు వర్తిస్తుంది.

పాత ధర: ప్రామాణిక క్యూబిక్ మీటర్‌కు రూ. 119.90
కొత్త ధర: ప్రామాణిక క్యూబిక్ మీటర్‌కు రూ. 82.95
తగ్గింపు: దాదాపు రూ. 36.95 మేర తగ్గింది.

**తగ్గింపుకు కారణాలు**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీనివల్ల భారతదేశానికి వచ్చే ఎల్ఎన్‌జీ సరఫరాలకు కొంత అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో గ్యాస్ కొరత ఏర్పడకుండా ఉండేందుకు పారిశ్రామిక వినియోగదారులు తమ కాంట్రాక్ట్ వాల్యూమ్‌లో 40 శాతానికి వినియోగాన్ని తగ్గించుకోవాలని కంపెనీ గతంలోనే కోరింది. సరఫరా సవాళ్లు ఉన్నప్పటికీ, అప్‌స్ట్రీమ్ ధరలు తగ్గడంతో ఆ లాభాన్ని వినియోగదారులకు అందించాలని ాూ+ా నిర్ణయించింది. గ్యాస్ పంపిణీ సమానంగా జరగాలని, అదే సమయంలో సిస్టమ్ స్థిరంగా ఉండాలనే లక్ష్యంతో ఈ ధరల సవరణ చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది.

సామాన్యులపై ప్రభావం ఏంటి?

ఈ ధరల తగ్గింపు కేవలం పారిశ్రామిక, వాణిజ్య విభాగాలకు మాత్రమే పరిమితం అయ్యింది.

CNG -- వంట గ్యాస్ : అదానీ గ్యాస్ వాల్యూమ్‌లో 70 శాతం గృహ అవసరాలకు, వాహనదారులకే సరఫరా అవుతుంది. ఈ విభాగాల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. దిగుమతి చేసుకున్న గ్యాస్: మిగిలిన 30 శాతం దిగుమతి చేసుకున్న ాచీ+ ద్వారా వస్తుంది. దీనినే పరిశ్రమలకు కేటాయిస్తారు. ప్రస్తుత తగ్గింపు ఈ విభాగానికే వర్తిస్తుంది. సరఫరాలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూనే, పరిశ్రమలకు భారం తగ్గించే దిశగా అదానీ-టోటల్ గ్యాస్ వేసిన ఈ అడుగు పారిశ్రామిక వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. దీనికి సంబంధించి గెయిల్ ఇండియా నుండి మరిన్ని స్పష్టతలు కోరినట్లు కంపెనీ తెలిపింది. దీనివల్ల భవిష్యత్తులో సరఫరా మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

# డిప్రెషన్, దృష్టి లోపం..
# ఈ రెండూ గుండెకు ముప్పే, తాజా అధ్యయనం



మారుతున్న జీవనశైలిలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థితి, ఇంద్రియాల పనితీరు కూడా గుండె ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా మానసిక కుంగుబాటు కంటి చూపు మందగించడం అనేవి విడివిడిగానే కాకుండా, కలిస్తే గుండె జబ్బుల ముప్పును ప్రమాదకర స్థాయికి తీసుకెళ్తాయని తాజా అంతర్జాతీయ అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

ఇది కూడా చదవండి..లవ్ హార్మోన్ అంటే ఏమిటి.. ఇది కూడా చదవండి..రాత్రి 9 గంటల తర్వాత డిన్నర్ చేయడం వల్ల కలిగే నష్టాలు ఇవే.. ఇది కూడా చదవండి..వేగంగా బరువు తగ్గించే ఓట్జెంపిక్ డ్రింక్ ట్రెండ్.. డైటీషియన్లు ఏమంటున్నారంటే.. చైనాలోని మిడిల్ ఏజ్డ్ , వృద్ధులపై నిర్వహించిన ఒక భారీ స్థాయి పరిశోధన ప్రకారం.. డిప్రెషన్ ఉన్నవారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం దాదాపు 60 శాతం ఎక్కువగా ఉంది. అలాగే, దృష్టి లోపంతో బాధపడుతున్న వారిలో ఈ ముప్పు 25 శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

ముప్పు పెరగడానికి కారణాలివే..

ఈ రెండూ నేరుగా, పరోక్షంగా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.కంటి చూపు సరిగా లేని వారు లేదా మానసిక కుంగుబాటులో ఉన్నవారు వ్యాయామం చేయడానికి, బయట తిరగడానికి ఇష్టపడరు. ఇది ఊబకాయం, రక్తపోటుకు దారితీసి గుండెపై ఒత్తిడి పెంచుతుంది. డిప్రెషన్ వల్ల శరీరంలో ఒత్తిడి హార్మోన్లు (ౕ౯తీవం ౯శీతీఏశీఅవం) పెరిగి, గుండె కండరాలకు రక్తప్రసరణను అడ్డుకోవచ్చు. కుంగుబాటులో ఉన్నవారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించలేక, క్రమం తప్పకుండా వాడాల్సిన మందులను నిర్లక్ష్యం చేస్తారు. ఇది ప్రమాదాన్ని మరింత పెంచుతుంది.

రెగ్యులర్ స్క్రీనింగ్..

45 ఏళ్లు పైబడిన వారు కేవలం బీపీ, షుగర్ మాత్రమే కాకుండా, కంటి చూపు, మానసిక స్థితిని కూడా ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే కేవలం ఆహార నియమాలు పాటిస్తే సరిపోదు; మానసిక ప్రశాంతత, మెరుగైన దృష్టి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒంటరితనం డిప్రెషన్‌ను పెంచుతుంది కాబట్టి, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపడం ఉత్తమం. మొత్తానికి, 'కంటిని.. మనసుని' క్షేమంగా ఉంచుకుంటేనే 'గుండె' పదికాలాల పాటు పదిలంగా ఉంటుందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఇది కూడా చదవండి..హార్ట్ ఎటాక్ తర్వాత తొలి 60 నిమిషాలు ఎందుకంత కీలకం..ఇది కూడా చదవండి..విటమిన్ సి లోపించినప్పుడు కనిపించే ముఖ్య లక్షణాలు ఇవే.. ఇది కూడా చదవండి..ఓఆర్ఎస్ ఆరోగ్యానికి మంచిదేనా.. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు.. ఇది కూడా చదవండి..దేహ శరీరానికి అవసరమయ్యే నీటి పరిమాణంలో కొత్త మార్గదర్శకాలు.. ఇది కూడా చదవండి..ఎలాంటి కొలెస్ట్రాల్ ఆరోగ్యానికి హానికరం..

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# మొండి పుండ్లకు జెల్ చికిత్స!
# తాజా అధ్యయనంలో కీలక విషయాలు!

**పుండు మానడంలో ఆక్సిజన్ ది కీలక పాత్ర – పరిశోధకులు ఏం చెప్పున్నారంటే!**



ఎంతకీ మానని మొండి పుండ్లు పెద్ద సమస్య. వీటికి చికిత్స చేయటం చాలా కష్టం. ఒకవేళ పుండ్లు మానకపోతే పాదాలు, వేళ్లు తొలగించాల్సిన పరిస్థితీ తలెత్తుతుంది. రోజు రోజుకీ వృద్ధులు, డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొండి పుండ్ల కొత్త చికిత్సలకూ ప్రాధాన్యం ఏర్పడుతోంది. దీని విషయంలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, రివర్‌సైడ్ రూపొందించిన జెల్ పట్టీ వ్యవస్థ కొత్త ఆశలు రేపుతోంది. గాయమైన చోట లేదా పుండ్లు ఉన్న చోట నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేయటం ద్వారా పుండ్లు మానేలా చేయటం దీని ప్రత్యేకత. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

ఆక్సిజన్ పాత్ర :

మాములుగా నాలుగు వారాల్లోపు నయం కాని పుండ్లను మొండిపుండ్లుగా భావిస్తుంటారు. ఈ రకం పుండ్లు నెలల కొద్దీ మానకుండా వేధిస్తుంటాయి. వీటితో ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావటం, హాస్పిటల్‌లో చేరాల్సి రావటం వంటి జరుగుతుంటాయి. కొన్ని సార్లు కాళ్లూ, చేతుల వంటివి తొలగించాల్సిన పరిస్థితీ కూడా ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 1.2 కోట్ల మంది మొండి పుండ్ల బారినపడుతున్నారని నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీరిలో సుమారు 20 శాతం మందికి పాదాలు, వేళ్ల వంటివి తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నాయి. పుండ్లు మానకపోవటానికి ఒక ప్రధాన కారణం.. ఆ భాగానికి తగినంతగా, స్థిరంగా ఆక్సిజన్ అందకపోవటమే అంటున్నారు నిపుణులు. సాధారణంగా పుండు 4 దశలు ద్వారా మానుతుంటున్నారు నిపుణులు. ముందు వాపు ప్రక్రియ తలెత్తుతుందని, ఆ తర్వాత కొత్త రక్తనాళాలు పుట్టుకొస్తాయని పేర్కొంటున్నారు. అనంతరం కణజాలం తిరిగి కుదురుకుంటుందని తెలియజేస్తున్నారు. ఆఖరికి కొత్త కణజాలం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని దశల్లోనూ ఆక్సిజన్ పాత్ర కీలకమంటున్నారు. ఆక్సిజన్ తగినంత అందకపోతే వాపు ప్రక్రియ ఎక్కువ కాలం కొనసాగుతుందని చెబుతున్నారు. ఇది బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి, ఇన్‌ఫెక్షన్ తలెత్తటానికి అనువైన వాతావరణం కల్పిస్తుందని తెలియజేస్తున్నారు. మరోవైపు కణజాలం తిరిగి కోలుకునే ప్రక్రియ కూడా నిలిచిపోతుందని వెల్లడిస్తున్నారు. దెబ్బతిన్న కణజాలం లోతుల్లోకి ఆక్సిజన్ చేరకపోతే మరింత సమస్యంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. దీన్ని పరిష్కరించటానికే పరిశోధకులు కొత్త జెల్ వ్యవస్థను రూపొందించారు. మెత్తగా, మృదువుగా ఉండే ఇది గాయమైన భాగం వద్దే నిరంతరం నేరుగా ఆక్సిజన్‌ను సృష్టిస్తుందంటున్నారు పరిశోధకులు.

ఎలా పనిచేస్తుంది :

జెల్ పట్టీలో నీరు, కొలిన్ ఆధారిత ద్రవం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. యాంటీ బ్యాక్టీరియా గుణం గల కొలిన్ ఆధారిత ద్రవం సురక్షితమైందని, తనకు తానే క్షీణిస్తుందని అంటున్నారు. వినికిడి సాధనాల్లో ఉండేటువంటి చిన్న బ్యాటరీతో అనుసంధానమైనప్పుడు ఈ వ్యవస్థ చిన్న విద్యుత్ రసాయన పరికరంగా మారుతుందని పేర్కొంటున్నారు. అప్పుడు నీటి అణువులు విడిపోయి నెమ్మదిగా, అవసరమైనంత మేరకు ఆక్సిజన్ పుట్టుకొస్తూ ఉంటుందని వివరిస్తున్నారు. ద్రవాలను పీల్చుకునే లేదా యాంటీ మైక్రోబియల్ పదార్థాలతో కూడిన సంప్రదాయ పుండ్ల పట్టీల మాదిరిగా కాకుండా ఇది ఆక్సిజన్ లేమి సమస్యను పరిష్కరించటం ద్వారా పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. ముందుగా పుండు ఆకారాన్ని కచ్చితంగా మార్చి, ఆక్సిజన్ మోతాదులు తక్కువగా ఉన్నచోట పగుళ్లను పూడ్చివేస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్‌ఫెక్షన్ ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. నిరంతరం ఆక్సిజన్ సరఫరా కావటం వల్ల రక్తనాళాలూ త్వరగా పుట్టుకొస్తాయని, ఫలితంగా పుండు వేగంగా మానుతుందని సూచిస్తున్నారు.

ఆశాజనక ఫలితాలు :

వినూత్న జెల్ పట్టీని డయాబెటిస్ గల, వృద్ధ ఎలుకల మీద ప్రయోగించి, పరిశీలించారు పరిశోధకులు. ఎందుకంటే, వీటి పుండ్లు వృద్ధుల్లో తలెత్తే దీర్ఘకాల పుండ్లనే పోలి ఉన్నాయంటున్నారు. చికిత్స చేయకపోతే పుండు మానదని, ప్రాణాంతకంగానూ పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, ఎలుకలకు వారానికి ఒకోసారి పట్టీని మార్చుతూ, సుమారు 23 రోజుల పాటు చికిత్స చేశారని వివరిస్తున్నారు. అన్నీ జీవించి ఉన్నాయని తెలియజేస్తున్నారు. తద్వారా పట్టీ మంచి ఫలితం చూపుతున్నట్టు దీని ద్వారా రుజువైందని చెబుతున్నారు. ల్యాబ్ లో కణజాలాలు, అవయవాలను వృద్ధి చేయటంలోనూ ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడటం కీలకమంటున్నారు. ఇలాంటి వాటికీ జెల్ పట్టీ ఉపయోగపడగలదని భావిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# కొలెస్ట్రాల్ తో బాధపడుతున్నారా - తగ్గించడానికి వైద్యుల సూచనలివే!

**సైలెంట్ కిల్లర్ గా అధిక కొలెస్ట్రాల్ – ఆహారం,**

**వ్యాయామంతో కంట్రోల్ లో ఉంటుందంటున్న నిపుణులు!**



కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో మనం తినే ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. జీవనశైలి ద్వారా కొంత వరకు కొలెస్ట్రాల్ ను అదుపులో ఉంచుకోగలిగినప్పటికీ, ఆహారపు అలవాట్లను మార్చుకోకపోతే దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా ఉండలేమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో శరీరంలో కొలెస్ట్రాల్ ను ఎలా తగ్గించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం! శరీరంలో కొలెస్ట్రాల్ మోతాదు పెరగడానికి కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం ఒక్కటే కారణం కాదు. శరీరతత్త్వం, జన్యువులు, జీవనశైలి వంటివి చాలానే ప్రభావితం చేస్తాయంటున్నారు ప్రముఖ పోషకాహార నిపుణులు డా. జానకీ శ్రీనాథ్. అయితే, వాటిని సమతుల్యం చేసుకుంటూ ఆహార నియంత్రణ పాటిస్తే కొలెస్ట్రాల్ తగ్గించుకోవడం సాధ్యమే అని చెబుతున్నారు. ఈ క్రమంలో కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, కొవ్వు పదార్థాలు శక్తి జనకాలట. వీటిని శరీర అవసరాలకు మించి, ఏ రూపంలో తీసుకున్నా కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఎలాగంటే, నూనెలు ఎక్కువగా ఉండే పచ్చులు, చిరుతిళ్లు, డీప్ ఫ్రైలు, పిండిపదార్థాలు, పనీర్, గుడ్లు, చికెన్, త్వరగా జీర్ణమయ్యే ప్రాసెస్ట్ ఫుడ్, స్వీట్లు, పళ్ల రసాలు వంటివన్నీ ఇందులోకి వస్తాయట.

ఎంత మోతాదులో ఉండాలి :

సాధారణంగా 20 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసు ఉన్నవారికి రక్తంలో ఎల్‌డీఎల్ 100 ఎమ్జి/డీఎల్ కన్నా తక్కువగా ఉండాలంటున్నారు నిపుణులు. అదే, 190 ఎమ్జి/డీఎల్ కన్నా మించితే మాత్రం స్టాటిన్లు వాడుకోవటం తప్పదని సూచిస్తున్నారు. ఒకవేళ ఎల్‌డీఎల్ మోతాదులు 189 ఎమ్జి/డీఎల్ ఉండి, గుండెజబ్బు ముప్పు అంతగా లేనట్టయితే జీవనశైలి మార్పులు పాటించొచ్చట. అలాగే, తగినంత నిద్ర, పొగాకు వాడకపోవటం, ఒత్తిడి తగ్గించుకోవటం వంటివి మేలు చేస్తాయట. అయితే, ఆహారం, ఎక్సర్ సైజ్ లు మరింత ఎక్కువ ప్రయోజనం కలిగిస్తాయి.

ఎలాంటి ఆహారం తీసుకోవాలి :

శరీరంలో కొలెస్ట్రాల్ నియంత్రించుకోవాలంటే, ముందు మన శరీర బరువు, ఎత్తు ఎంత, మనం చేసే పనులకు ఎంత ఎనర్జీ అవసరం లాంటి విషయాలు తెలుసుకోవాలట. అందుకు ఏయే పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి? లాంటివన్నీ పరిగణనలోకి తీసుకుని వైద్యులు సూచించే బ్యాలెన్స్ డైట్ ని అనుసరించాలంటున్నారు డా. జానకీ శ్రీనాథ్. అందులో ఫైబర్ ఎక్కువగా, నూనె తక్కువగా ఉండే పదార్థాలు, నెమ్మదిగా జీర్ణమయ్యే ఓట్స్, చిరుధాన్యాలు, మొక్కజొన్న, బార్లీ తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా, తాజా పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వాలట. అలాగే, డ్రై ఫ్రూట్స్ బదులు చియా, అవిసె గింజలను తీసుకోవాలి. ఈ మార్పులు చేసుకోవడంతో పాటు శారీరక శ్రమ, వ్యాయామం, ధ్యానం, యోగా తగినంతగా ఉండేలా చూసుకోవాలి. ఎత్తుకు తగ్గ బరువున్నారో లేదో చూసుకుని అందులో కనీసం పది శాతమైనా తగ్గేలా డ్యాన్స్, ఏరోబిక్స్ వంటి చేయగలిగితే కొలెస్ట్రాల్ ని తగ్గించుకోవచ్చట. రోజుకు 2 గ్రాముల ప్లాంట్ స్టెరాల్స్ లేదా స్టానాల్స్ తీసుకోవడం వల్ల ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ దాదాపు 10% తగ్గుతుందని పేర్కొంది.

వ్యాయామం మేలు :

శారీరక శ్రమ, వ్యాయామం చేస్తున్నప్పుడు రక్తంలోకి హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) విడుదలవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది రక్తనాళాల్లో పోగుపడిన ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) తగ్గిస్తుందట. ఈ క్రమంలో వారానికి కనీసం 150 నిమిషాల ఒక మాదిరి ఎక్సర్ సైజ్ లేదా 75 నిమిషాల తీవ్ర వ్యాయామం అవసరమని సిఫారసు చేస్తుంది. వాకింగ్, సిమ్మింగ్, వెయింట్ లిఫ్టింగ్, డ్యాన్స్ వంటి ఏవైనా చేయొచ్చట. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# వాస్తవాలు-అపోహలు: రోజ్ వాటర్ తో చర్మానికి మేలు జరుగుతుందా..



**సాక్షి లైఫ్ :**

చర్మ సౌందర్యం అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది రోజ్ వాటర్. బామ్మామ్మల కాలం నాటి చిట్కా అయినా, నేటి మోడరన్ స్కిన్ కేర్ రొటీన్ అయినా.. దీనికి ఎప్పుడూ ప్రత్యేక స్థానమే. సహజసిద్ధమైన ఈ సుగంధ ద్రవం చర్మానికి చేసే మేలు అంతా ఇంతా కాదు.ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఎండ వల్ల చర్మం కందిపోయినా లేదా ఎర్రగా మారినా కొద్దిగా రోజ్ వాటర్ చిలకరిస్తే వెంటనే ఉపశమనం లభిస్తుంది. ఇది కూడా చదవండి..బ్లడ్ క్యాన్సర్ ను గుర్తించడానికి ఎలాంటి పరీక్షలు చేస్తారు..ఇది కూడా చదవండి..ఓఆర్ఎస్ ఆరోగ్యానికి మంచిదేనా.. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు.. ఇది కూడా చదవండి..డిప్రెషన్ ఉన్న వారిలో ఎలాంటి మార్పులు కనిపిస్తాయి.. రోజ్ వాటర్ వల్ల కలిగే వాస్తవ ప్రయోజనాలు సహజసిద్ధమైన టోనర్: ముఖంపై పేరుకుపోయిన అదనపు నూనెను, మురికిని తొలగించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. చర్మం జూన స్థాయిని సమతుల్యం చేస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఎండ వల్ల చర్మం కందిపోయినా లేదా ఎర్రగా మారినా కొద్దిగా రోజ్ వాటర్ చిలకరిస్తే వెంటనే ఉపశమనం లభిస్తుంది. చర్మానికి తక్షణ హైడ్రేషన్‌ను అందిస్తుంది. ముఖ్యంగా డ్రై స్కిన్ ఉన్నవారికి ఇది గొప్ప వరమనే చెప్పాలి.

**యాంటీ ఆక్సిడెంట్లు:**

ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతినకుండా కాపాడి, వృద్ధాప్య ఛాయలను నెమ్మదింప చేస్తాయి. రోజ్ వాటర్ వినియోగంపై సమాజంలో అనేక అపోహలు ఉన్నప్పటికీ, వాస్తవాలను గమనిస్తే దాని పరిమితులు అర్థమవుతాయి. రోజ్ వాటర్ వాడటం వల్ల చర్మం రంగు పూర్తిగా మారుతుందని చాలామంది భావిస్తారు, కానీ వాస్తవానికి ఇది చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుందే తప్ప పుట్టుకతో వచ్చే రంగును మార్చలేదు.

అలాగే, ఇది మొటిమలను పూర్తిగా నయం చేస్తుందనేది మరొక అపోహ; ఇది కేవలం మొటిమల వల్ల కలిగే వాపును, ఎరుపును మాత్రమే తగ్గిస్తుంది, తీవ్రమైన సమస్యలకు మాత్రం చర్మ వ్యాధి నిపుణుల చికిత్స తప్పనిసరి. ఇక మార్కెట్లో దొరికే ఏ రోజ్ వాటర్ వాడినా ఫలితం ఒకటేనని అనుకోవడం పొరపాటు. రసాయనాలు, కృత్రిమ రంగులు, వాసనలు కలిపిన ఉత్పత్తులు చర్మాన్ని దెబ్బతీస్తాయి, కాబట్టి ఎల్లప్పుడూ స్వచ్ఛమైన, సహజసిద్ధమైన రోజ్ వాటర్‌ను ఎంచుకోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరం.

ఎలాంటి జాగ్రత్తలు అవసరం..

స్వచ్ఛమైన రోజ్ వాటర్ సురక్షితమే అయినా, కొందరికి దీనివల్ల అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి మొట్టమొదటిసారి వాడేటప్పుడు చేతిపై కొద్దిగా రాసి 'ప్యాచ్ టెస్ట్' చేసుకోవడం ఉత్తమం. రోజ్ వాటర్ వాడిన వెంటనే చర్మంపై తేమ ఆరిపోకుండా మంచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. రాత్రి పడుకునే ముందు రోజ్ వాటర్‌ను ముఖానికి అప్లై చేయడం వల్ల మరుసటి రోజు ఉదయానికి చర్మం తాజాగా కనిపిస్తుంది.

ఇది కూడా చదవండి..ఒత్తిడి, ఆందోళనను తగ్గించడానికి బెస్ట్ ఫుడ్ ఏది.. ఇది కూడా చదవండి..విటమిన్ సి లోపించినప్పుడు కనిపించే ముఖ్య లక్షణాలు ఇవే.. ఇది కూడా చదవండి..రాత్రి 9 గంటల తర్వాత డిన్నర్ చేయడం వల్ల కలిగే నష్టాలు ఇవే..

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి..

# ఇండియాలో 'సైలెంట్ ఎపిడెమిక్'గా మారుతున్న నిద్ర రుగ్మతలు..!



నేటి ఆధునిక జీవనశైలిలో నిద్ర అనేది ఒక విలాసంగా మారిపోతోంది. రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు చేయించుకునే మనం.. 'రాత్రి సరిగ్గా నిద్రపోతున్నామా..' అనే విషయాన్ని మాత్రం విస్మరిస్తున్నాం. మార్చి 13న 'ప్రపంచ నిద్ర దినోత్సవం' సందర్భంగా వైద్య నిపుణులు వెల్లడించిన గణాంకాలు భారతీయుల ఆరోగ్య స్థితిగతులపై ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో లక్షలాది మంది నిద్ర రుగ్మతలతో బాధపడుతున్నారని, ఇది గుండె జబ్బులు, మధుమేహం, డిప్రెషన్‌కు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కూడా చదవండి..సిండ్రోమ్ శకు ప్రారంభ దశలో ఎలాంటి చికిత్సను అందిస్తారు.. ఇది కూడా చదవండి..టిపికల్ ఫీవర్స్ అంటే ఏమిటి.. వాటి లక్షణాలు ఎలా ఉంటాయి.. ఇది కూడా చదవండి..మీరు ఆరోగ్యంగా బరువు తగ్గాలంటే.. నిద్రలేమి.. సైలెంట్ ఎపిడెమిక్.. ఇండియన్ జర్నల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన తాజా అధ్యయనం ప్రకారం.. భారతీయుల్లో నిద్ర సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. 25.7 శాతం మంది నిద్రలేమి సమస్యతో సతమతమవు తున్నారు. సుమారు 37.4 శాతం మందిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. 10.6 శాతం మంది ఈ రుగ్మత బారిన పడ్డారు. వైద్య సహాయం పొందడానికి బదులు 62 శాతం మంది ఆన్‌లైన్ చిట్కాలపై ఆధారపడుతుండటం గమనార్హం. హైదరాబాద్ ఐటీ నిపుణుల్లో తీవ్ర ప్రభావం.. హైదరాబాద్ లాంటి నగరాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఐటీ నిపుణులపై నిర్వహించిన సర్వేలో 97 శాతం మంది పడుకునే ముందు కనీసం గంటపాటు ఎలక్ట్రానిక్ పరికరాలను వాడుతున్నారని తేలింది. దీనివల్ల నిద్ర పట్టకపోవడం లేదా మధ్యలో మెలకువ రావడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వయస్సు, నిద్ర అవసరమైన సమయం.. నిద్ర అనేది కేవలం విశ్రాంతి మాత్రమే కాదు, మెదడు, శరీర విధులను పునరుద్ధరించే కీలక ప్రక్రియ అని వైద్యనిపుణులు చెబుతున్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు వాళ్లకు 6 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి. 45 నుంచి 70 ఏళ్ల వయస్సువాళ్లకు 5 నుంచి 7 గంటల నిద్ర అవసరం. 70 ఏళ్లు పైబడిన వారికి కనీసం 5 గంటల నిద్ర అవసరం ఉంటుంది. రోడ్డు ప్రమాదాలకు కారణం.. నిద్రలేమి కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాదు, ప్రజా భద్రతకు కూడా ముప్పుగా మారుతోంది. ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై జరుగుతున్న ప్రమాదాల్లో 40 శాతం డ్రైవర్ల అలసట,నిద్రలేమి వల్లే జరుగుతున్నాయని సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. ఇతర దేశాల్లో మాదిరిగా డ్రైవర్లకు నిద్ర రుగ్మతల స్క్రీనింగ్‌ను భారత్‌లోనూ తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉందని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిద్ర సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నివారణ ఆరోగ్య సంరక్షణలో భాగంగా గుర్తించాలి. క్రమబద్ధమైన సమయపాలన, నిద్రకు ముందు గ్యాడ్జెట్లకు దూరంగా ఉండటం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇది కూడా చదవండి..నోటి దుర్వాసనను తగ్గించే చిట్కాలు ఇది కూడా చదవండి..ఒత్తిడిని ఫుడ్ చేంజెస్ చేయడం ద్వారా తగ్గించవచ్చా.. ఇది కూడా చదవండి..అధిక బరువు తగ్గాలంటే రోజుకి ఎన్ని క్యాలరీలు బర్న్ అవ్వాలి.. గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి..

## భారత్ గ్యాస్ కోసం పోటెత్తిన వినియోగదారులు....



మెదక్//మార్చి 16 (ఆకాంక్ష) :మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రంలో భారత్ గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదారులు భారీగా ఏజెన్సీ వద్దకు తరలివచ్చారు. గ్యాస్ సిలిండర్ పొందాలంటే ముందస్తు బుకింగ్ చేసుకోవాలని సూచనలు రావడంతో సోమవారం ఉదయం నుంచే మహిళలు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఏజెన్సీ కార్యాలయం వద్దకు చేరుకొని క్యూ లైన్లలో నిలబడ్డారు.ఒక్కసారిగా అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో అక్కడ తీవ్ర రద్దీ నెలకొంది. పలువురు మహిళలు, వృద్ధులు గంటల తరబడి లైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం ప్రారంభమైన బుకింగ్ ప్రక్రియ మధ్యాహ్నం వరకు కొనసాగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో స్పష్టత లేకపోవడం, బుకింగ్ కోసం ప్రత్యక్షంగా రావాల్సిన పరిస్థితి ఉండటంతో వినియోగదారులు ఏజెన్సీ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నట్లు తెలుస్తోంది. కొంతమంది మహిళలు చిన్నపిల్లలతో కలిసి లైన్లలో నిలబడటం అక్కడ కనిపించింది. గంటల తరబడి లైన్లలో నిలబడి బుకింగ్ చేసుకోవాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేసి గ్యాస్ సిలిండర్ల సరఫరాను త్వరగా చేపట్టాలని వారు కోరుతున్నారు.భవిష్యత్తులో ఇలాంటి రద్దీ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసి వినియోగదారులకు సౌకర్యవంతంగా సేవలు అందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో

## ముగ్గురు ఎస్ఐలు మృతి..



బెంగళూరు//మార్చి 16 (ఆకాంక్ష) : ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ముగ్గురు ఎస్ఐలు మృతి చెందిన సంఘటన కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ ప్రాంతం చెళ్లకెర తాలూకాలోని బెంగళూరు- బళ్లారి జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంగావతి ప్రాంతానికి చెందిన మంజునాథ్, సింధనూర్‌కు చెందిన అంబరీశ్ బార్గీ, తీర్థహళ్లికి చెందిన సచిన అనే ముగ్గురు పోలీసులు కర్నాటక రిజర్వు పోలీస్ దళంలో ఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు ఎస్ఐలు తన స్నేహితుడిని పెళ్లికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు. హగ్గరే గ్రామ శివారులో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ముగ్గురు ఎస్ఐలు ఘటనా స్థలంలోనే చనిపోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. చిత్రదుర్గ ఎస్పి రంజిత్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఝార్ఖండ్ కు చెందిన ట్రక్కు తుముకూర్ నుంచి బళ్లారిలోని జిందాల్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

### సైదాబాద్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో

## 19 నుండి 27 వరకు శ్రీరామనవమి మహోత్సవాలు...

9 రోజుల పాటు ప్రతి రోజు భక్తులకు ఉచితంగా శివాభి శేఖం, నవగ్రహాభి శేఖం సౌకర్యం...



హైదరాబాద్//మార్చి 16 (ఆకాంక్ష) : శ్రీ షిరిడి సాయిబాబా మందిరం ( శివ సాయి మందిరం) సైదాబాద్ లోని శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 4 లో ఈ నెల 19 నుండి 27 వరకు శ్రీరామనవమి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు షిరిడి సాయి సేవా సమితి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దివ్య విశ్వ శక్తి పీఠం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ ఓం స్వరూపాజీ స్వామీజీతో కలిసి ఆలయ కమిటీ కార్యదర్శి పి సుబ్రహ్మణ్య శాస్త్రి, కోశాధి కారి పి రామకృష్ణ, ఎన్ ప్రసాదరావు,కైలాస్ శ్రీధర్ మాట్లాడారు. ముఖ్యంగా ఉగాది పర్వదినం 19 తేది నుండి 27 వరకు 9 రోజుల పాటు ప్రతి రోజు భక్తులకు ఉచితంగా శివాభి శేఖం, నవగ్రహాభి శేఖం సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 27 వ తేది ఉదయం 6:30 లకు బాబాకు, సీతారాములకు పాలాభిషేకం, 8:00 గంటలకు భక్తులచే బిక్షాటన 9:30 కు సీతారాముల కళ్యాణం, 12:30 సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ విందు భోజనం రాత్రి 8 గంటలకు సీతారాముల రాథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు వెల్లడించారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## మాలలకు విద్యను దూరం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ...




హైదరాబాద్//మార్చి 16 (ఆకాంక్ష) :రాజ్యాంగాన్ని విరుద్ధంగా ప్రస్తుత జనాభా లెక్కలు కులగానన చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఏకసభ్య కమిషన్ వేసి చంద్రబాబు నియంత్రుత్వం లో వర్గీకరణ చేసి అందులో కొత్తగా రోస్టర్ పాయింట్ పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలకు విద్యను శాశ్వతంగా దూరం చేసాడని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. హైదర్ గూడలో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఒకటి, రెండు, మూడు, గ్రూపులుగా వర్గీకరించాలని డిమాండ్ చేసారు. ఒకటవ గ్రూప్ కు అయిదు శాతం రిజర్వేషన్లు రోస్టర్ పాయింట్లు 7, రెండవ గ్రూపు 9% రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లు 2, 16 , 27, 47, 52, 66, 72, 87, 97, మూడవ గ్రూపు 5 శాతం రిజర్వేషన్లు రోస్టర్ పాయింట్లు 22, 41, 62, 77, 91 కాబట్టి పివిఆర్ రావు స్థాపించిన మాల మహానాడుగా మేము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రోస్టర్ పాయింట్లు రెండవ గ్రూపు మాదిరిగా సరిచేయాలని డాక్టర్ పద్ధతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాబోయే రాచకొండ, సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎన్ విని కుమార్, గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్, కే అరుణ్ కుమార్ త్వేలన్గన కన్వినర్, పి రాజేష్ ,ఎం.జి వినయ్ కుమార్ తృదితేరులు పాల్గొన్నారు.

## నందిని సిద్ధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...



హైదరాబాద్/మార్చి 16 (ఆకాంక్ష) : ప్రముఖ కవి, రచయిత నందిని సిద్ధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 2026 సంవత్సరానికి గాను ఆయన రాసిన 'అనిమేష' కవితా సంపుటికి ఈ పురస్కారం లభించింది. కరోనా కాలంలోని సామాజిక పరిస్థితులు, మానవీయ కోణాలను ఈ కవితా సంపుటిలో సిద్ధారెడ్డి చిత్రించారు. సాహిత్య అకాడమీ అవార్డు కింద రూ.లక్ష నగదు, తామ్రపత్రం, శాలువాను ప్రధానం చేస్తారు. నందిని సిద్ధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమి తొలి ఛైర్మన్‌గా పని చేశారు. సిద్ధారెడ్డికి సాహిత్య అకాడమి అవార్డు రావడంపై బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ సాహిత్యానికి దక్కిన గౌరవం అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ నిరసన...



సుల్తానాబాద్//మార్చి 16 (ఆకాంక్ష) :తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సోమవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ సుల్తానాబాద్ మండలాధ్యక్షుడు కందుల శ్రీనివాస్ నాయకత్వంలో జరిగిన ఈ నిరసన అనంతరం నాయకులు మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. అర్హులైన ఇల్లు లేని పేదలకు ఇళ్లను మంజూరు చేయాలని, వితంతువులు మరియు వృద్ధులకు పింఛన్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా సకాలంలో చెల్లించడంతో పాటు సన్నవడ్లకు బోనస్ ప్రకటించి వెంటనే అందించాలని కోరారు. అలాగే రైతులకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద రూ.1,00,116 నగదుతో పాటు తులం బంగారం ఇవ్వాలని, అర్హులైన మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత, వితంతువులు, వృద్ధులు, మహిళలు మరియు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే బీజేపీ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, అమరగాని ప్రదీప్ కుమార్, కాసెగోని నిర్మల, కోశాధికారి కామని రాజేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, నల్ల మనోహర్ రెడ్డి, చాటరాజు రమేష్, ఎర్రంశెట్టి మునిందర్, కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, యువ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, శశివర్ధన్, మల్కా భాగ్యలక్ష్మి, ఉషణ అన్వేష్, బండారి లత, దాసరి చందు, పొన్నం శ్రీనివాస్, ఐలవేణి శ్రీనివాస్, గుడ్ల వెంకటేష్, శంకర్, కిరణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కండరాలు బలంగా ఉండాలా - నిపుణులు సూచిస్తున్న డైట్ టిప్స్ ఇవే!

పోషకాహారంతో పాటు వ్యాయామం

తప్పనిసరి- మెనూలో వీటిని చేర్చుకుంటే

మంచిదంటున్న నిపుణులు!



మనం రోజూ రకరకాల పనులు చేస్తుంటాం. నడవటం వంటి తేలికైన పనుల దగ్గర నుంచి బరువులు ఎత్తటం వంటి కష్టమైన పనుల వరకూ ఎన్నెన్నో చేస్తుంటాం. వీటి అన్నింటినీ సజావుగా చేయాలంటే కండరాలు బలంగా ఉండటం ఎంతో అవసరం. కానీ, వయసు మీద పడుతున్న కొద్దీ మన కండరాల బలం కూడా తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, కొంతమంది బరువు ఎక్కువగా ఉండటం వల్ల కండరబలం క్షీణిస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో కండరాల సామర్థ్యం పెరగాలంటే ఎలాంటి డైట్ తీసుకోవాలో నిపుణులు వివరిస్తున్నారు. అది ఇప్పుడు తెలుసుకుందాం!

కండరాల క్షీణతకు కారణాలు :

మధ్యవయసు నుంచి ఏటా 1-2 శాతం చొప్పున కండరాలు క్షీణిస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా 80 ఏళ్లు వచ్చేసరికి సుమారు 40 శాతం కండరాల మోతాదు తగ్గిపోవచ్చని అంటున్నారు. ఈ క్రమంలో శారీరక శ్రమ లేకపోవటం, టెస్టోస్టెరాన్, గ్రోత్ హార్మోన్ వంటి హార్మోన్లు తగ్గటం, వయసుతో పాటు శరీరంలో తలెత్తే వాపు ప్రక్రియ.. ప్రొటీన్ తగినంత తీసుకోకపోవటం వంటివన్నీ కండరాల క్షీణతకు దారితీస్తుంటాయని పేర్కొంటున్నారు. కాలి కండరాలు బలహీనమైతే నడక వేగం తగ్గడంతో పాటు కింద పడిపోయే ముప్పు పెరుగుతుందంటున్నారు నిపుణులు. అయితే, కండరాలకు కాసింత పని చెప్పటం, సమతులాహారం తీసుకోవటం ద్వారా దీన్ని నెమ్మదింపజేసుకునే అవకాశం ఉందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ముఖ్యంగా, మధ్యవయసు నుంచే కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిదట.

బలోపేతానికి ఏం చేయాలి :

బరువు ఎక్కువగా ఉన్నవారు అదుపులో ఉండటంతో పాటు కొవ్వు శాతాన్ని తగ్గించుకుని కండరాల దృఢత్వాన్ని పెంచుకోవాలంటున్నారు ప్రముఖ పోషహకార నిపుణులు డాక్టర్ లతాశశి. ఇందుకు పోషకాహారం ఒక్కటే సరిపోదని చెబుతున్నారు. బ్రిస్క్ వాకింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు వారానికి 4-5 రోజులు 30 నిమిషాల పాటు తప్పనిసరిగా చేయాలని అంటున్నారు. ఇవి చేస్తూనే క్యాలరీలు తక్కువ, ప్రొటీన్ ఎక్కువగా ఉంటే.. బ్రౌన్ రైస్, మిల్లెట్స్ తో చేసిన చపాతీ, పప్పు దినుసులు, పనీర్, సోయా వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే, ఆకుకూరలు, కాయగూరల్ని తక్కువ నూనెతో వండి తినాలని సలహా ఇస్తున్నారు. చికెన్, చేపలు, గుడ్డు ఆహారంలో తప్పనిసరిగా ఉండాలని తెలియజేస్తున్నారు. అలాగే, రోజూ తినే ఆహారంలో ఆయిల్ నాలుగు టీస్పూన్లకు మించనీయొద్దని పేర్కొంటున్నారు. మైదా, బేకరీ పదార్థాలు, రిఫైన్డ్ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని అంటున్నారు. సుమారు 124 గ్రా. చొప్పున పండ్లు, సలాడ్లు రోజూ తినడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుందని చెబుతున్నారు. నట్స్, సీడ్స్ ను మితంగా తీసుకోవాలని వివరిస్తున్నారు. వీటితో పాటు 7-8 గంటలు నిద్ర అవసరమని సూచిస్తున్నారు. రోజూ 3 లీటర్లు నీళ్లు తప్పనిసరిగా తాగాలని సలహా ఇస్తున్నారు.

నెమ్మదిగా కదులుతూ, కదలికలపై మనసు పెట్టి చేసే యోగా, తాయ్ చీ వంటి సంప్రదాయ పద్ధతులు కూడా ఎంతో మేలు చేస్తాయని అప్లం.బ౯ అధ్యయనం పేర్కొంది. ఇవి కండరాలను, కీళ్లను బలోపేతం చేయటంతో పాటు శరీరం తూలిపోకుండానూ కాపాడతాయంటున్నారు నిపుణులు. అంతేకాదు, మానసిక ప్రశాంతత కూడా చేకూరుతుందని చెబుతున్నారు. కండరాల బలం పెరగటానికి బరువులను వ్యతిరేక బలాన్ని తట్టుకునే వ్యాయామాలు బాగా ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల శక్తిని బట్టి బరువులు ఎత్తటం, సాగే బ్యాండ్ల వంటి పరికరాలతో వ్యాయామాలు చేయడం మేలంటున్నారు. ముందు చిన్న బరువులతో ప్రారంభించి, క్రమంగా పెంచుకుంటూ రావాలని సూచిస్తున్నారు. దీంతో తుంటి, మోకాలు, మడమలు, భుజాల కండరాలు బలోపేతమవుతాయని పేర్కొంటున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## ఈ సప్లిమెంట్లను మీరు తరచూ వాడుతున్నారా.. అయితే జాగ్రత్త.. హెచ్చరిస్తున్న వైద్యులు..



ఈ మధ్యకాలంలో చాలా మంది సప్లిమెంట్స్ మీద ఆధారపడుతున్నారు. ఆరోగ్యాన్ని పెంచడానికి , పోషక అంతరాలను పూరించడానికి అనేక వనమూలికలను తీసుకుంటున్నారు. ఇవన్నీ కూడా సహజమైనవి, సురక్షితమైనవి అని లేబుల్ చేయబడి ఉంటున్నాయి. దీంతో వీటిని ఉపయోగించే వారు ఇవన్నీ కూడా సురక్షితమైనవి అని భావిస్తున్నారు.

ఈ సప్లిమెంట్లను మీరు తరచూ వాడుతున్నారా.. అయితే జాగ్రత్త.. హెచ్చరిస్తున్న వైద్యులు..

ఈ మధ్యకాలంలో చాలా మంది సప్లిమెంట్స్ మీద ఆధారపడుతున్నారు. ఆరోగ్యాన్ని పెంచడానికి , పోషక అంతరాలను పూరించడానికి అనేక వనమూలికలను తీసుకుంటున్నారు. ఇవన్నీ కూడా సహజమైనవి, సురక్షితమైనవి అని లేబుల్ చేయబడి ఉంటున్నాయి. దీంతో వీటిని ఉపయోగించే వారు ఇవన్నీ కూడా సురక్షితమైనవి అని భావిస్తున్నారు. కానీ లేబుల్ చేయబడిన మాత్రాన ఇవన్నీ సురక్షితం కావనీ వైద్యులు చెబుతున్నారు. వీటిని వాడడం వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఈ మందులు ముఖ్యమైన అవయవాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. సప్లిమెంట్స్, మూలికా మందులు అందరికీ సురక్షితం కావని ఇవి ఒక్కొక్కరిపై ఒక్కోలా ప్రభావం చూపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. చాలా మంది ఎక్కువగా ఉపయోగించే కొన్ని రకాల సప్లిమెంట్స్, మూలికలు శరీరంపై ఏ విధంగా ప్రభావం చూపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

గ్రీన్ టీ క్యాప్సూల్స్..

గ్రీన్ టీ ని చాలా మంది తాగుతూ ఉంటారు. ఒక కప్పు గ్రీన్ టీ తాగడం సురక్షితమైనదే. అయితే గ్రీన్ టీ ని సులభంగా తయారు చేసి తీసుకోవడానికి చాలా మంది క్యాప్సూల్స్ ను ఉపయోగిస్తున్నారు. అయితే ఈ క్యాప్సూల్స్ లో అధిక స్థాయిల్లో కాటెకిన్లు ఉంటాయి. ముఖ్యంగా అధిక మొత్తంలో ఉండే జు+జ+ కాలేయ మంటను, తీవ్రమైన కాలేయ అనారోగ్యాన్ని కలిగిస్తుంది. కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడే వారిలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. కనుక గ్రీన్ టీ క్యాప్సూల్స్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

ప్రోటీన్ పౌడర్లు..

అలాగే రోజూ వ్యాయామం చేసేవారు ప్రోటీన్ పౌడర్లను ఎక్కువగా తీసుకుంటారు. కానీ వీటిని వైద్యుడిని సంప్రదించకుండా ఎక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో నైట్రోజన్ వ్యర్థాలు ఎక్కువగా తయారవుతాయి. ఈ వ్యర్థాలను బయటకు పంపించడానికి మూత్రపిండాలు అదనంగా పని చేయాల్సి వస్తుంది. మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడడం వల్ల వాటి పనితీరు మందగించడంతో పాటు మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు ప్రోటీన్ పౌడర్ అవసరమైనప్పటికి దీనిని అతిగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

విటమిన్ సప్లిమెంట్లు..

కొవ్వులో కరిగే విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి వాటిని కూడా ఈ మధ్య కాలంలో చాలా మంది తీసుకుంటున్నారు. ఈ విటమిన్లు కొవ్వు కణజాలాల్లో పేరుకుపోతాయి. వీటిని ఎక్కువగా ఎక్కువగా తీసుకోవడం వల్ల కొవ్వు కణజాలల్లో అధికంగా నిల్వ చేయబడతాయి. ముఖ్యంగా విటమిన్ ఎ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. మూత్రపిండాల వ్యాధులు ఉన్న వారు వైద్యుడిని సంప్రదించకుండా ఈ విటమిన్లను తీసుకోకపోవడమే మంచిది. అలాగే ఐరన్ సప్లిమెంట్స్ వాడకం కూడా పెరిగిందని చెప్పవచ్చు. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కణజాలాల్లో ఐరన్ పేరుకుపోయి హిమోక్రోమాటోసిస్ అనే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. దీని వల్ల అవయవాల పనితీరు తగ్గుతుంది. దీర్ఘకాలిక నష్టం కలుగుతుంది. అలాగే కాంఫ్రే( సౌరక చెట్టు) వంటి హెర్బల్ మూలికలను ఉపయోగించే వారు కూడా జాగ్రత్తగా ఉండాలి. వీటిలో కాలేయానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించే సమ్మేళనాలు ఉంటాయి. ఈ మూలికలను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయం తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

అతిమధురం వేర్లు..

లికోరైస్ రూట్ ను కూడా కొన్ని రకాల నివారణలల్లో ఉపయోగిస్తారు. దీనిని అధికంగా వాడడం వల్ల పొటాషియం స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు తగ్గుతుంది. మూత్రపిండాలు, గుండె జబ్బులతో బాధపడే, అంతర్లీన ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ఇది మరింత ప్రమాదకరంగా ఉంటుంది. అదే విధంగా డిటాక్స్, కొవ్వును కరిగించే సప్లిమెంట్స్ త్వరిత ఫలితాలను ఇస్తాయి. అయితే ఇవి కాలేయ జీవక్రియ ప్రక్రియను, మూత్రపిండాల వడపోత ప్రక్రియను మందగించేలా చేస్తాయి. వీటిని అధికంగా వాడడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. కాలేయ వ్యాధులు ఉన్నవారు మరింత ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సప్లిమెంట్స్ ను, మూలికలను తీసుకోవడం మంచిదే అయినప్పటికీ వీటిని తగిన మోతాదులో వైద్యుడి సూచనల మేరకు ఉపయోగించడం మంచిది. సప్లిమెంట్స్ ను అధికంగా ఉపయోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాలతో పాటు శరీర ఆరోగ్యం కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది కనుక వీటిని తగిన మోతాదులో వైద్యుడిని సంప్రదించిన తరువాత ఉపయోగించడం మంచిది.

# మట్టి మనుషుల కావ్యం





**మార్చి 16 (ఆకాంక్ష) :** ఆవుల రంకె విన్న పల్లె.. ఆనందాల పొదరిల్లు! ప్రతి లోగిలి ఒక విందు.. ప్రతి మాట ఒక పసందు!! ముసిముసి నవ్వుల ముంగిట..! వేకువజామున విరిసిన కళ్ళాపి జల్లు!! రంగుల ముగ్గుల నడుమ.. తొంగిచూసే సిరి వెలుగులు! పొగచూరిన పొయ్యి నుంచి వచ్చే ఆ పొగ వాసన!! అమ్మ ప్రేమతో కలిపిన ఆ గోరుముద్దల తీయదన! అలుపెరుగని హాలికుడి అడుగులు..!! భుజాన నాగలి.. గుండెలో నమ్మకం! నేలను నమ్ముకున్నవాడికి.. ఆకాశమే హద్దు!! కురిసే ప్రతి వాన చినుకు ఒక వరమై! మొలకెత్తే ప్రతి గింజ ఒక ప్రాణమై..!! అన్నదాత శ్రమలో ఉంది.. ఈ జగతికి అసలైన జీవం!! ప్రకృతి ఒడిలో పండగ..! ఏరువాక సాగగా.. ఎడ్ల బండి కదలగా!! పచ్చని చేలల్లో.. పైరుగాలి పాటలు పాడగా! కాలవ గట్టున కూర్చుని వినే.. నీటి గలగలలు!! రచ్చబండపై వినిపించే.. తాతల కాలం నాటి కథలు!! నిరాడంబర స్వర్గం..! అంతస్తుల మేడలు లేవు.. కపటపు వేషాలు లేవు! కమ్మని మట్టి వాసనలో.. కమ్మని మనసుల కలయిక!! కనుమరుగవుతున్నా చెక్కుచెదరని.. ఆ పాత జ్ఞాపకం! ప్రతి భారతీయుడి గుండె చప్పుడు..!! మన పల్లెటూరి జీవనం!!! డా.పూసపాటి వేదాద్రి 9912197694

## జడ్చర్లలో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు...

### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక...



జడ్చర్ల//**మార్చి 16 (ఆకాంక్ష) :** వంట గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడే డీలర్ల డీలర్‌షిప్పులను రద్దు చేయించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపిస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌కు సంబంధించిన ఆధారాలు ఉంటే ప్రజలు నేరుగా తనకు పంపాలని ఆయన పిలుపునిచ్చారు. ఇరాన్‌ఇజ్రాయిల్‌అమెరికా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో వంట గ్యాస్ సిలిండర్లకు కొరత ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో సోమవారం ఆయన జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని, సిలిండర్లను బుక్ చేసిన వారందరికీ సరఫరా జరుగుతోందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.అయితే భవిష్యత్తులో సిలిండర్లు దొరకవనే ప్రచారంతో ప్రజలు ఒకేసారి గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి సిలిండర్ల కోసం బారులు తీరుతుండటంతో కొరత ఉన్నట్లుగా భావన కలుగుతోందని అనిరుధ్ రెడ్డి తెలిపారు. చాలా ఏజెన్సీల వద్ద ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ పరిస్థితిని కొంతమంది డీలర్లు దుర్వినియోగం చేస్తూ వంట గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజల ఆందోళనను ఆసరాగా తీసుకుని ఎవరైనా సిలిండర్లను ఎక్కువ ధరలకు విక్రయిస్తే వారి డీలర్‌షిప్పులను రద్దు చేయించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపిస్తామని ఆయన హెచ్చరించారు.ప్రజలు కూడా బ్లాక్ మార్కెట్లో సిలిండర్లు కొనుగోలు చేసిన సందర్భాల్లో వాటికి సంబంధించిన ఆధారాలను తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని నేరుగా పంపిస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమాలకు పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు.మండల స్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లయిస్ అధికారులు వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సూచించారు.

## యూజీడీ నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలి...

### సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య డిమాండ్...



గోదావరిఖని//**మార్చి 16 (ఆకాంక్ష) :** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ యూజీడీ నిర్మాణ పనుల్లో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని సిపిఐ పార్టీకి చెందిన 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓకు ఆయన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మార్కపురి సూర్య మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఫండ్స్‌కు సంబంధించిన రూ.13 కోట్ల 70 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టేందుకు ఏడుప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని తెలిపారు. అయితే ఈ టెండర్లలో స్థానిక కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి 0.5 నుండి 1.5 శాతం లెస్ పర్సెంటేజ్‌తో పనులను దక్కించుకున్నారని ఆరోపించారు. దీనికి వెనుక అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి భారీ అవినీతికి పాల్పడినట్లు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో ఆర్సీసీ పైపులు వినియోగించి నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేయాలని, చాంబర్లను కూడా నాణ్యతతో నిర్మించాలని వర్క్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ కాంట్రాక్టర్లు నాసిరకం పనులు నిర్వహించారని ఆయన ఆరోపించారు. ఆర్సీసీ పైపులకు బదులుగా మట్టి పైపులు వాడుతూ నాణ్యత ప్రమాణాలను పూర్తిగా విస్మరించి యూజీడీలు నిర్మించారని పేర్కొన్నారు.సి.డి.ఎం.ఏ నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఫండ్స్‌ను కార్మికుల జీతభత్యాలు లేదా మున్సిపల్ అత్యవసర అవసరాల కోసం వినియోగించాల్సి ఉండగా, ఇంజినీరింగ్ విభాగంలోని ఉన్నతాధికారులు కమిషన్లకు ఆశపడి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఆ నిధులను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కేటాయించినట్లు ఆయన ఆరోపించారు. అతి తక్కువ లెస్ పర్సెంటేజ్‌తో పనులు కేటాయించడం వల్ల కార్పొరేషన్‌తో పాటు ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.రామగుండం కమిషనర్ యూజీడీ నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, క్వాలిటీ కంట్రోల్ విభాగం ద్వారా పనుల నాణ్యతను తనిఖీ చేయించాలని మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. అవినీతిలో భాగస్వామ్యమైన అధికారులు, కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విజిలెన్స్ విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత బిల్లులు చెల్లించకుండా నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తే భవిష్యత్తులో శాఖాపరమైన, న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని మార్కపురి సూర్య హెచ్చరించారు.

## గాంధీ పార్క్ పాఠశాలలో సీసీ కెమెరాలు, కంప్యూటర్ల ప్రారంభం...



గోదావరిఖని//**మార్చి 16 (ఆకాంక్ష) :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్ గాంధీనగర్‌లో ఉన్న ఎంపీపీ ఎస్ గాంధీ పార్క్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సీసీ కెమెరాలు, కంప్యూటర్లు మరియు ఆట పరికరాలను నగర మేయర్ మహంకాళి స్వామి ప్రారంభించారు. బెస్ట్ రన్నర్స్ సొసైటీ ప్రతినిధి సతీష్ ఆధ్వర్యంలో పాఠశాలకు ఐదు కంప్యూటర్లు, సీసీ కెమెరాలు మరియు ప్లేగ్రౌండ్‌కు అవసరమైన ఆట పరికరాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మహంకాళి స్వామి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి సీసీ కెమెరాలు మరియు కంప్యూటర్లను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆట పరికరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ కల్వల పద్మావతి రంజిత్, మండల విద్యాధికారి జింక మల్లేశం, బెస్ట్ రన్నర్స్ సొసైటీ ప్రతినిధి సతీష్, కార్పొరేటర్లు మీర్జా ఫజల్ బేగ్, వడ్లూరి రవి, దాసరి విజయ్ కుమార్, దూళికట్ట సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర సిబ్బంది హాజరయ్యారు.

# కాంగ్రెస్ 6 గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలి...

### మిడ్జిల్ బీజేపీ మండల శాఖ డిమాండ్...



జడ్చర్ల//**మార్చి 16 (ఆకాంక్ష) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సహా ప్రజలకు చేసిన అనేక హామీలను తక్షణమే అమలు చేయాలని మిడ్జిల్ బీజేపీ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మిడ్జిల్ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్‌కు మెమోరాండం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ వాటిలో చాలా వరకు ఇప్పటివరకు పూర్తిగా అమలు కాలేదని ఆరోపించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం, నిరుద్యోగ భృతి అందించడం వంటి కీలక హామీలు అమలు కావడం లేదని తెలిపారు. అలాగే వృద్ధాప్య, వితంతు మరియు దివ్యాంగులకు ఇవ్వాల్సిన ఆసరా పెన్షన్లు అర్హులైన వారికి అందడం లేదని పేర్కొన్నారు. మండలంలో దరఖాస్తులు చేసుకున్న అనేక మంది వృద్ధులు, వికలాంగులు మరియు ఒంటరి మహిళలకు ఇప్పటికీ పెన్షన్లు మంజూరు కాలేదని తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.రైతుల పరిస్థితి కూడా తీవ్రంగా ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా నిధులు సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతుల ఆర్థిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని రైతు భరోసా పథకాన్ని సమయానికి అమలు చేయాలని కోరారు.అదేవిధంగా పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన దరఖాస్తులు ఇంకా పరిష్కారం కాలేదని, వాటిని వెంటనే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సమస్యలు కూడా పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రభుత్వ పథకాల కోసం అవసరమైన ఈ పత్రాలను నిర్ణీత సమయంలో జారీ చేసి అర్హులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.మండల పరిధిలోని ప్రజా సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేసిన మెమోరాండంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు నరేందర్, మండల ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, శేఖర్, దామోదర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కావాలి నరేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎన్టీపీసీ సిఎస్ఆర్...



గోదావరిఖని//**మార్చి 16 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలోని రామగుండం పరిధిలో ఎన్టీపీసీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం, శారీరక దృఢత్వాన్ని పెంచడం మరియు సమగ్ర అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించడం లక్ష్యంగా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో రామగుండం, కమాన్‌పూర్, అంతర్గాం, పాలకుర్తి మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మొత్తం నాలుగు మండలాల నుండి 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఈ గ్రామీణ క్రీడా పోటీలలో పాల్గొంటుండడం విశేషం. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు వాలీబాల్, ఖో-ఖో వంటి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ (ఓ అండ్ ఎం) తెలంగాణ ముకుల్ రాయ్, హెచ్ ఆర్ అధిపతి బిజోయ్ కుమార్ సిక్దార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హెచ్ ఆర్ ప్రవీణ్ కె. చౌదరి గౌరవప్రదంగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఎన్టీపీసీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అధికారులు, ఎన్టీపీసీ సిఎస్ఆర్ బృందం సభ్యులు, పాల్గొనే పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు (పీడీలు), ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విద్య మరియు క్రీడల ద్వారా సమాజ అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ సిఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గ్రామీణ క్రీడా పోటీలు యువత సాధికారతకు దోహదపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి భవిష్యత్‌లో ప్రతిభావంతమైన క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఈ పోటీలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

### ఏఐటీయూసీ, ఐఎన్టియుసి

## చీకటి ఒప్పందాలు కార్మికులకు నష్టదాయకం...

### హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్...




గోదావరిఖని/**మార్చి 16 (ఆకాంక్ష) :** ఏఐటీయూసీ, ఐఎన్టియుసి మధ్య జరుగుతున్న చీకటి ఒప్పందాలు కార్మికుల ప్రయోజనాలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. ఆర్జీ వన్ జీఎం ఏఐటీయూసీకి దొడ్డిదారిన నెలకు రూ.10 లక్షలు ఇస్తున్నారని కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్నప్పటికీ కార్మికులకు సాధించిన ప్రయోజనాలు ఏవీ లేవని విమర్శించారు. ఇప్పటికే కార్మికులకు ఉన్న పలు హక్కులను కూడా ఈ గుర్తింపు సంఘం కోల్పోయేలా చేసిందని ఆయన అన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా వచ్చిన తర్వాతే మెడికల్ బోర్డు వ్యవస్థ నిలిచి పోయిందని, దాంతో అనేక మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు కూడా ఆగిపోయాయని పేర్కొన్నారు. కార్మికులు కష్టపడి సంపాదిస్తున్న జీతంలో నాలుగు నెలల వేతనం ఇన్కమ్ టాక్స్ రూపంలోనే వెళ్తోందని, దీనిపై కూడా కార్మిక సంఘాలు స్పందించడం లేదని విమర్శించారు. మెడికల్ బోర్డు లేకపోవడం వల్ల అనేక మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు నిలిచిపోయి వారు రోడ్డున పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై గుర్తింపు సంఘం అయిన ఏఐటీయూసీ గానీ, తామే ఎక్కువ ఏరియాల్లో గెలిచామని చెప్పుకుంటున్న ఐఎన్టియుసి గానీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ఇదే సమయంలో ఆరెల్లి పోషం, గాలి కిరణ్ కుమార్, నాగేందర్ కుమార్, విజేందర్ రెడ్డి తదితరులు హెచ్ఎంఎస్‌లో చేరినట్లు రియాజ్ అహ్మద్ తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఖయ్యూం, ఆర్జీ వన్ వైస్ ప్రెసిడెంట్ ఆరెల్లి పోషం, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ గాలి కిరణ్ కుమార్, బ్రాంచ్ సెక్రటరీ పల్లె క్రాంతి కుమార్, జాయింట్ సెక్రటరీ దెబ్బెట సతీష్, కోశాధికారి దుర్గం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్, ఏరియా వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి నాగేందర్, శ్రీధర్, సార్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో

## గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల పతకాల పంట...



పెద్దపల్లిటౌన్//**మార్చి 16 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్షిప్‌లో కరీంనగర్‌కు చెందిన గాయత్రి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. స్థానిక కొత్తపల్లిలోని ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థులు మొత్తం 13 పతకాలను సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ పోటీల్లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు, మూడు రజిత పతకాలు, ఆరు కాంస్య పతకాలు గెలుచుకుని పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. బంగారు పతకాలను ఎన్. సాద్వి జెస్సి, జె. సాత్విక్, శ్రీయన్, సన్యూ జనత్ సాధించారు. రజిత పతకాలను ఎన్. సాన్వి జెస్సి, పి. సహస్ర, పి. సాయి వర్షిత్ అందుకున్నారు. కాంస్య పతకాలను ఎం. సుప్రత్, ఏ. రీతిక్, జి. ప్రతిక్షి, జె. సహస్ర, బి. ఆరాధ్య, శ్రీ అద్య సాధించారు.విజేతలకు రాష్ట్ర కరాటే అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మరియు ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు కె. వసంత్ కుమార్ చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలైన కరాటేలో కూడా రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు.



విద్యార్థుల విజయంపై గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లోని క్రమశిక్షణ, పట్టుదల మరియు నిరంతర సాధన వారిని విజేతలుగా నిలిపాయని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, కరాటే కోచ్ ప్రవీణ్, పీఈటీలు అజయ్ కుమార్, మంజుల తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

## సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన....




నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 16 (ఆకాంక్ష) :** ప్రొఫెసర్ జయశంకర్ బీఎస్సీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు 'రావెప్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉయ్యాలవాడ గ్రామంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, సేంద్రియ ఎరువులు తయారీ విధానం వంటి అంశాలపై రైతులకు వివరించారు.ప్రధానంగా మామిడి తోటల్లో ఆశించే పురుగుల నివారణకు 'ఫెరోమెన్ ట్రాప్స్' ఏర్పాటు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించి రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో పురుగులను ఎలా నిర్మూలించాలి, పంటలను వివిధ రకాల పురుగుల నుంచి ఎలా రక్షించుకోవాలి అనే విషయాలను వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు అక్షిత, సునీత, నవ్య, ప్రియాంక, రాజేశ్వరి, సౌమ్యతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## జనగణన 2027 కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలి...






పెద్దపల్లిటౌన్/**మార్చి 16 (ఆకాంక్ష) :** దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు కీలకమైన జనగణన 2027 కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్‌పై సంబంధిత అధికారులకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ మాట్లాడుతూ జనగణన తొలి దశకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం మార్చి 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడుతుందని తెలిపారు. జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు.జనగణన ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అధికారి మీద ఉందని ఆమె తెలిపారు. శిక్షణలో భాగంగా డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అధికారులు అవగాహన పొందాలని సూచించారు. కేటాయించిన అధికారులు శిక్షణను పూర్తిస్థాయిలో గ్రహించి తమ విధుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు.జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల, మున్సిపల్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు రూ.600 కూలి ఇవ్వాలని సిపిఎం డిమాండ్...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 16 (ఆకాంక్ష): ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం బిజినెపల్లి మండల కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం రూ.307 కూలి మాత్రమే చెల్లిస్తున్నదని, కూలీలకు కల్పించాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో లేవని విమర్శించారు.గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిధులను తగ్గిస్తూ ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని బలహీనపర్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి కూలీలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు.ఈకార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి హనుమంతు, మల్లేష్, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో గ్యాస్ కొరతపై సిపిఐ నిరసన...




నాగర్ కర్నూల్ టౌన్//వ**మార్చి 16 (ఆకాంక్ష) :** దేశంలో నెలకొన్న వంట గ్యాస్ కొరతను నివారించడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్ విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సిపిఐ నాయకులు ఖాళీ సిలిండర్లు,కుండలతో ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కట్టెల పొయ్యిపై జొన్న రొట్టెలు వండి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. దేశంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని పట్టించుకోవడం లేదని ఫయాజ్ ఆరోపించారు. పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించి, లబ్ధిదారులందరికీ వెంటనే సిలిండర్లు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ జి, జిల్లా నాయకులు ఈర్ల చంద్రమౌళి, కే కృష్ణాజి, బండి లక్ష్మీపతి, సయ్యద్ ఖాజా మొయినద్దీన్, గోపిచారి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానం....



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 16 (ఆకాంక్ష) : ప్రజాపాలనప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన గ్రామపంచాయతీ కార్మికులను బిజినేపల్లి మండలంలోని బిజినేపల్లి గ్రామంలో సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ మిద్దె ఇందిరా రాములు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్టీపర్పస్ కార్మికులకు శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మిద్దె ఇందిరా రాములు మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత పరిరక్షణలో మల్టీపర్పస్ కార్మికులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రతిరోజు ఉదయం నుంచి గ్రామ వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేస్తున్న కృషి వల్ల గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. ప్రజాపాలనప్రగతి లక్ష్యాలను సాధించడంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గడ్డమీద మహేష్, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, వార్డు సభ్యులు బెల్ల శివలింగం, మంగి శాంతయ్య, జిల్లెల్ల స్నేహ, కళ్యాణ్, కారి నేతాజీ, రంగా నరేందర్, చిర్నం రాజేశ్వరి, పాత్లవత్ పాండు, ప్రజాప్రతినిధులు కంపిల్ల మల్లయ్య, జాజాల ఆంజనేయులు, ఇరుగంటి నరసింహ, చీర్ణం పరమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## హోటళ్లు, రెస్టారెంట్లపై రెవెన్యూ అధికారుల ఆకస్మిక దాడులు...



నాగర్ కర్నూల్ టౌన్/మార్చి 16 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలో అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగాన్ని అరికట్టేందుకు రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అచ్చంపేట పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో హోటళ్లు, రెస్టారెంట్లపై అధికారులు తనిఖీలు చేపట్టారు.ఎమ్మార్వో సైదులు, ఆర్ఐ శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీలలో వాణిజ్య అవసరాల కోసం అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అధికారులు గుర్తించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో వంట కోసం వినియోగిస్తున్న పలు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.వాణిజ్య వినియోగానికి కేవలం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందని అధికారులు వ్యాపారులకు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భవిష్యత్తులో కూడా ఇటువంటి అక్రమ వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక దాడులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలని హోటల్ యజమానులు, రెస్టారెంట్ నిర్వాహకులకు సూచించారు.ఈ ఆకస్మిక దాడుల్లో రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొని పలు వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు.

## ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి...

### రామగుండం మేయర్ మహంకాళి స్వామి...



గోదావరిఖనిటౌన్//మార్చి 16 (ఆకాంక్ష) : పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 4 ఇంక్లైన్ ఈద్గా ప్రాంగణాన్ని సోమవారం ఆయన సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఈద్గా వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈద్గా ప్రాంగణంలో శుభ్రత, తాగునీటి సదుపాయం, లైటింగ్, పారిశుధ్య ఏర్పాట్లు, పార్కింగ్ వంటి అన్ని సౌకర్యాలను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.రంజాన్ పవిత్ర మాసం ముస్లింలకు అత్యంత ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగినదని, ఈ సమయంలో వారు ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకునే విధంగా ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఎల్లప్పుడూ మైనార్టీ సోదర సోదరీమణుల అభ్యున్నతికి కట్టుబడి ఉంటారని, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తారని తెలిపారు.అదేవిధంగా రామగుండం నియోజకవర్గంలోని అన్ని ఈద్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు, మసీదు కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వందశాతం అక్షరాస్యత సాధనకు అధికారులు కృషి చేయాలి...




నాగర్ కర్నూల్//మార్చి 16 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలో వందశాతం అక్షరాస్యత సాధన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదవడం, రాయడం నేర్చుకున్న నిరక్షరాస్య మహిళలు, వయోజనులకు ఈ నెల 29న నిర్వహించే ప్రీ‌ఫైనల్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎల్ఎన్ఏటీ) పరీక్షలకు విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా మార్చి 29న నిర్వహించనున్న నిరక్షరాస్యుల అక్షరాస్యత పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలోని ప్రతి నిరక్షరాస్యుడు తప్పనిసరిగా పరీక్షకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. అధికారిక విద్యకు దూరమైన 15 సంవత్సరాలు పైబడిన వయోజనులకు చదవడం, రాయడం, లెక్కలు మరియు ప్రాథమిక జీవన నైపుణ్యాలను అందించడమే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి సమాజంలో వారికి ఆత్మవిశ్వాసం పెంపొందించడం ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలో చదవడం, రాయడం నేర్చుకున్న నిరక్షరాస్య మహిళలు, వయోజనులు కలిపి మొత్తం 25,313 మంది ఈ పరీక్షలకు హాజరై తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని ఆయన సూచించారు. పరీక్షను జిల్లావ్యాప్తంగా సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.నిరక్షరాస్యుల పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఈ నెల 27వ తేదీ లోపు జిల్లాలోని పాఠశాలలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మండల స్థాయిలో వాలంటీర్లు అవసరమైన చర్యలు తీసుకుని పరీక్షల నిర్వహణను విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేసు, జిల్లా వయోజన విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ రమేష్ కుమార్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, సీఎంఓ వెంకటయ్య, మండల స్థాయి వయోజన విద్య వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతపై సిపిఐ వినూత్న నిరసన...

### కట్టెల పొయ్యిపై జొన్న రొట్టెలు చేసి ఆందోళన...

### మోడీ ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ విమర్శ...



నాగర్ కర్నూల్/మార్చి 16 (ఆకాంక్ష) : దేశంలో నెలకొన్న వంట గ్యాస్ కొరతను నివారించడంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తీవ్రంగా విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సిపిఐ శ్రేణులు వినూత్నంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం నుండి ఖాళీ గ్యాస్ సిలిండర్లు, కుండలతో ప్రదర్శనగా బయలుదేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన చేపట్టారు. గ్యాస్ కొరతను నిరసిస్తూ కట్టెల పొయ్యిపై వంటలు చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కట్టెల పొయ్యిపై జొన్న రొట్టెలు తయారు చేస్తూ "దేశంలో గ్యాస్ కొరత సిగ్గు సిగ్గు", "ప్రజలకు గ్యాస్ అందించాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ దేశంలో వినియోగించే వంట గ్యాస్‌లో సుమారు 90 శాతం వరకు ఇరాన్, కువైట్, మస్కట్, సౌదీ అరేబియా, దుబాయ్ వంటి దేశాల నుంచి దిగుమతి అవుతుందని తెలిపారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడుల కారణంగా అంతర్జాతీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారి దేశంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఏర్పడిందని అన్నారు. ఇలాంటి పరిస్థితులు ఏర్పడతాయని ముందే అంచనా వేసి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, కానీ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం విచారకరమని విమర్శించారు. దేశంలో ప్రజలు ఖాళీ సిలిండర్లతో కిలోమీటర్ల మేర క్యూ లైన్లో నిలబడుతున్నా ప్రభుత్వం మాత్రం గ్యాస్ కొరతే లేదని చెప్పడం దారుణమని ఆయన అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులను శాంతింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తోందన్నారు. యుద్ధాల ప్రభావంతో దేశంలో ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న ప్రతి వినియోగదారునికి తక్షణమే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని, లబ్ధిదారులందరికీ వంట గ్యాస్ అందుబాటులోకి తీసుకురాక పోతే సిపిఐ ఆధ్వర్యంలో గ్యాస్ గోదాములను ముట్టడిస్తామని హెచ్చరించారు.సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో పరిస్థితులు అల్లకల్లోలంగా మారుతున్నా దేశంలోని పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, కె.కృష్ణాజీ, బండి లక్ష్మీపతి, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, మర్యాద వెంకటయ్య, రవీందర్ కుమార్, దేశమోని అంజనేయులు, మధుగౌడ్, నాగర్ కర్నూల్ పట్టణ కార్యదర్శి గోపిచారి, సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి,నాయకులు బాలపీర్, శ్రీనివాసులు, విజయ్, విష్ణు, హుస్సేన్, సత్యమ్మ, రామచంద్రప్ప, దామోదర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు వేగవంతమైన పరిష్కారం ఇవ్వాలి...

### అధికారులకు అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ ఆదేశాలు...



నాగర్ కర్నూల్//మార్చి 16 (ఆకాంక్ష) : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిశీలించి పరిష్కరించాలని నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం అధికారుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వేదికగా ఉపయోగపడుతోందని తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు స్వీకరించామని ఆయన తెలిపారు. అందులో ఉన్న ఫిర్యాదులు, అర్జీలను సంబంధిత శాఖలు సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా ఆలస్యం చేయకుండా పరిశీలించి వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి ద్వారా వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వారంలోపే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అన్ని శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి...

### మార్చి 31లోగా లైసెన్స్ పొందాలి...

### మున్సిపల్ కమిషనర్ బి. నాగిరెడ్డి హెచ్చరిక...




నాగర్ కర్నూల్/మార్చి 16 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ పట్టణ పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి వాణిజ్య సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని మున్సిపల్ కమిషనర్ బి. నాగిరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని దుకాణాలు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు, హాస్పిటల్స్, హోటళ్లు సహా అన్ని రకాల వ్యాపార సంస్థలు మార్చి 31లోగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ఆయన సూచించారు.మున్సిపల్ పరిధిలో వ్యాపారం నిర్వహిస్తున్న వారు గడువులోగా లైసెన్స్ పొందకపోతే ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు 25 శాతం పెనాల్టీ విధించబడుతుందని తెలిపారు. అలాగే జూలై 1 నుంచి 50 శాతం పెనాల్టీతో పాటు లైసెన్స్ లేని షాపులను సీజ్ చేసే చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.వ్యాపారులు ముందస్తుగా ట్రేడ్ లైసెన్స్ పొందడం ద్వారా మున్సిపల్ నియమాలను పాటిస్తూ పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించిన మరిన్ని వివరాల కోసం తిరుపతయ్య (9550942030), సతీష్ (9160000647)లను సంప్రదించవచ్చని మున్సిపల్ అధికారులు తెలిపారు.

# ప్రజావాణిలో 11 ఫిర్యాదులు

### బాధితులతో స్వయంగా మాట్లాడిన ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్...



నాగర్ కర్నూల్//మార్చి 16 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి ఫిర్యాదు దారులు హాజరై తమ సమస్యలను జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మొత్తం 11 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు .ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎస్పీ, సంబంధిత పోలీసు అధికారులకు వాటిపై తక్షణ చర్యలు తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వచ్చిన ఫిర్యాదుల్లో భార్యాభర్తల మధ్య వివాదానికి సంబంధించిన ఒక ఫిర్యాదు ఉండగా, మిగిలిన పది ఫిర్యాదులు వివిధ అంశాలకు సంబంధించి న్యాయం కోరుతూ సమర్పించబడ్డాయి. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత పోలీసు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్పష్టం చేశారు.

## నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 16 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమీపంలోని ఐడిఓసి (ఇంటిగ్రాటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసస్ కాంప్లెక్స్ ) వద్ద బస్ స్టాప్ లేక ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీఎన్‌జీవోస్ (ఎచ్+టం) నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ పేర్కొంది. ప్రతిరోజూ సుమారు 500 మందికి పైగా ఉద్యోగులు, ప్రజలు కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ అధికారిక బస్ స్టాప్ లేక మహిళలు, వృద్ధులు కష్టాలు పడుతున్నారని తెలిపారు. ఐడిఓసి సమీపంలో వెంటనే "రిక్వెస్ట్ బస్ స్టాప్" ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంబంధిత అధికారులకు టీఎన్‌జీవోస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు బావండ్ల వెంకటేష్, కార్యదర్శి ఎం.డి. షర్ఫుద్దీన్, ఖజాంచి బాలరాజు సురేష్, చెన్నకేశవులు, రహీమ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో చిరుధాన్యాలతో ప్రత్యేక వంటకాల ప్రదర్శన...






నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 16 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థినిలు తాడూరు మండల పరిధిలోని ఇంద్రకల్ గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం మూడో రోజు కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బంగారమ్మ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిసరాలను శుభ్రపరిచి, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం అరికెలు, సామలు, ఊదలు, సజ్జలు, తైదలు, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలతో వివిధ రకాల వంటకాలను తయారు చేసి గ్రామస్తులకు రుచి చూపించారు.చిరుధాన్యాలతో తయారుచేసిన రవ్వలడ్డులు, రాగి లడ్డు, జొన్న అప్పాలు, డ్రైఫ్రూట్ లడ్డు, చిప్స్ వంటి వంటకాల తయారీ విధానాన్ని ప్రదర్శిస్తూ వాటి పోషక విలువలను వివరించారు. చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల బీపీ, షుగర్ వంటి వ్యాధులను నియంత్రించడంలో సహాయ పడుతాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఈ ఆహారాన్ని నిత్యాహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం ప్రోగ్రాం అధికారులు ప్రొఫెసర్ ఎన్. నవత, వి. శ్రీరమ్య ఆధ్వర్యంలో నిర్వహించగా విద్యార్థులు ఆకర్ష్, సుస్మిత, శంకర్, నిధి, స్వాతి, రామకృష్ణ, శరణ్య, పద్మజ, పూజిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అభినందించిన గ్రామ సర్పంచ్, గ్రామస్తులు విద్యార్థులను ప్రశంసించారు.

## ఎలక్ట్రిక్ వాహనాలు, వ్యవసాయ సోలార్ పంపులకు దరఖాస్తులు ఆహ్వానం...



ఓదెల//మార్చి 16 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాలు మరియు వ్యవసాయ సోలార్ పంపుల కోసం రుణాలు మంజూరు చేయనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వి. అనిల్ రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ పథకం కింద ఎలక్ట్రిక్ టూ వీలర్, ఎలక్ట్రిక్ త్రీ వీలర్ (గూడ్స్, ప్యాసింజర్) వాహనాలు అలాగే వ్యవసాయ సోలార్ పంపుల కోసం రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని నిరుద్యోగ యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని సూచించారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం కొనుగోలు కోట్, నివాస ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అభ్యర్థుల వయస్సు 21 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండాలని, కొన్ని వర్గాలకు మాత్రం 21 నుండి 60 సంవత్సరాల వరకు వయస్సు ఉన్న వారు అర్హులుగా పరిగణించబడతారని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17 నుండి 24 తేదీ వరకు [illegible] వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వి. అనిల్ రెడ్డి సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.